


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 11 జూన్ 2021 సంపుటి : 02 సంచిక :324 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఈ ఏడాది రూ.8,600 కోట్లతో ధాన్యం కొనుగోళ్లు: కోన శశిధర్

అమరావతి: ఈ ఏడాది రూ.8,600 కోట్లతో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ కోన శశిధర్ తెలిపారు. గతం కంటే ఎక్కువ ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 25 లక్షల 25 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు చేయగా ఎప్పుడూ లేని విధంగా కడప, కర్నూల్‌లో అధికంగా కొనుగోళ్లు చేసినట్లు తెలిపారు. ఇక రైతులు, దళారుల చేతిలో మోసపోకుండా నేరుగా కొంటున్నామని, ఈ క్రమంలో రైతుల పొలాలకు వెళ్లి ధాన్యం కోనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌బీకేల్లో రైతులకు రిజిస్ట్రేషన్, కొనుగోలు కూపన్లు ఇవ్వడం ద్వారా రైతులకు పేమెంట్ ఆలస్యం లేకుండా చేస్తున్నామని వెల్లడించారు. కేంద్రం నుంచి రూ.3,900 కోట్లు రావాల్సి ఉండగా, కేంద్రం ఏటా ఇచ్చే అడ్వాన్స్ కూడా ఇవ్వలేదని అయినా పెండింగ్‌లో ఉన్న రూ.300 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు.

# రఘురామకృష్ణరాజు టీడీపీ ఏజెంట్‌గా మారారు: అనిల్

### పోలవరం ప్రాజెక్ట్‌కు రావాల్సిన నిధుల కోసమే సీఎం జగన్ ఢిల్లీ పర్యటన
### చినబాబుకు ఫ్రస్ట్రేషన్ పీక్స్‌కి వెళ్లింది
### 2022 ఖరీఫ్ నాటికీ తప్పనిసరిగా సాగునీరు అందిస్తాం: అనిల్



విజయవాడ: ఎంపీ రఘురామకృష్ణరాజు టీడీపీకి ఏజెంట్‌గా మారారు అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ విషయంలో టీడీపీ చేసిన తప్పులను తాము చేయమని స్పష్టం చేశారు. అలానే లోకేశ్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు మంత్రి అనిల్. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ.. "పోలవరం ప్రాజెక్ట్‌ను అడ్డుకోవాలని టీడీపీ కుట్ర చేస్తోంది. రైతుల కళ్లలో ఆనందాన్ని టీడీపీ చూడలేకపోతోంది. ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ పోలవరం పనులు కొనసాగుతున్నాయి ఎదో ఒక రకంగా దాన్ని ఇబ్బంది పెట్టాలని టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అది పూర్తి అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌కి మంచి పేరు వస్తుందని వారి భయం. అందుకే రఘురామకృష్ణంరాజు లాంటి వాళ్ళతో అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు" అని మంత్రి అనిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "చినబాబు ఫ్రస్టేషన్ పీక్స్‌కి వెళుతోంది. మూడు శాఖలకు మంత్రిగా చేసినా ఎమ్మెల్యేగా గెలవలేకపోయాడు. ఉన్న ఎమ్మెల్సీ కూడా ఓ ఏడాదిలో పూర్తి అయిపోతుంది. అందుకే బయట తిరగలేక ఇంట్లో కూర్చుని జూమ్‌లో సీఎం జగన్ గురించి మాట్లాడుతున్నాడు.. కానీ వైఎస్ జగన్ గురించి మాట్లాడే అర్హత నీకు ఒక్క శాతమైనా ఉందా. మా తాత సీఎం, మా నాన్న సీఎం అని చెప్పుకున్నా నువ్వు గెలవలేక పోయావ్. కనుచూపు మేరలో నీ పార్టీ జగన్ సంక్షేమ పథకాలతో కొట్టుకుపోయే పరిస్థితి. జగన్ అముల్ బేబీ అయితే.. నువ్వు హెరిటేజ్ దున్నపోతువా. మాటలు నీకే కాదు...మాకు వచ్చు" అని మంత్రి అనిల్, లోకేశ్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "గూగుల్‌లో కొడితే నీ పేరు పప్పు అని వచ్చింది. నువ్వు గడ్డం పెంచగానే ఏదో జరగదు. ధైర్యం బై బర్త్ బ్లడ్‌లో ఉండాలి. ఆత్మగౌరవం లేకనే మీ నాన్న హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకున్నాడు. ఏ మాత్రం ఆంధ్ర ప్రజలపై ప్రేమ ఉన్నా గత ఐదేళ్లలో ఏపీలో ఇల్లు కట్టుకునే వాడు. పునరావాసం విషయంలో అన్ని చర్యలు తీసుకుంటున్నాము. 2022 ఖరీఫ్ నాటికీ తప్పనిసరిగా సాగునీరు అందిస్తాం. స్పిల్ వే పూర్తి చేయకుండా కాపర్ డ్యామ్ ఎలా కడతారు. వీళ్ళు చేసిన తప్పులను మాపై రుద్దాలని చూస్తున్నారు. సీఎం జగన్ పోలవరం కోసం రావాల్సిన నిధుల విషయంపై ఢిల్లీలో చర్చిస్తారు" అని మంత్రి అనిల్ తెలిపారు.

# కేంద్ర జలశక్తి మంత్రి షెకావత్‌తో సీఎం వైఎస్ జగన్ భేటీ





న్యూ ఢిల్లీలఅమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో భేటీ అయ్యారు. అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి షెకావత్‌తో సీఎం జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ పనుల పురోగతిని సీఎం జగన్ వివరించారు. పోలవరం ప్రాజెక్ట్ బకాయిల అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. షెకావత్‌తో సీఎం జగన్ సమావేశం దాదాపు 40 నిమిషాల పాటు కొనసాగింది. కాగా, రెండు రోజుల ఢిల్లీ పర్యటన నిమిత్తం సీఎం జగన్.. ఈ రోజు(గురువారం) గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన విషయం తెలిసిందే. సీఎం జగన్ వెంట ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి, మిథున్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, గురుమూర్తి ఉన్నారు. ఈ పర్యటన సందర్భంగా పలు అంశాలపై సీఎం జగన్ చర్చించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటనలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు, నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్‌లను కూడా సీఎం జగన్? కలవనున్నారు. సీఎం జగన్ ఢిల్లీ పర్యటనను ముగించుకొని తిరిగి శుక్రవారం తాడేపల్లి చేరుకుంటారు.

## 50 కోట్ల ఫైజర్ వ్యాక్సిన్లు కొని ప్రపంచ దేశాలకు ఇవ్వనున్న అమెరికా!

వాషింగ్టన్: ప్రపంచ దేశాల కోసం అమెరికాలోని జో బైడెన్ ప్రభుత్వం 50 కోట్ల ఫైజర్-బయోఎన్‌టెక్ కరోనా వ్యాక్సిన్లను కొనుగోలు చేయనున్నట్లు అక్కడి మీడియా బుధవారం వెల్లడించింది. దీనికి సంబంధించి జీ7 సమావేశంలో బైడెన్ అధికారిక ప్రకటన చేయనున్నట్లు వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్ పత్రికలు తెలిపాయి. ధనిక దేశాలే మెజార్టీ వ్యాక్సిన్లను కొనుగోలు చేశాయన్న ఆరోపణల నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికా కూడా తీవ్రంగా విమర్శలు ఎదుర్కొంటోంది. అమెరికా ఇప్పటికే తన సగానికి పైగా జనాభాకు వ్యాక్సిన్లు వేసేసింది. అక్కడి కరోనా కేసులు కూడా భారీగా తగ్గాయి. బ్రిటన్‌కు వెళ్లడానికి ఎయిర్‌ఫోర్స్ వన్ ఎక్కే ముందే దీనిపై ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు బైడెన్ హింట్ ఇచ్చారు. ప్రపంచం కోసం వ్యాక్సిన్ వ్యూహం ఏమైనా ఉందా అని ప్రశ్నించగా.. నా దగ్గర ఒక వ్యూహం ఉంది. త్వరలోనే ప్రకటిస్తాను అని ఆయన అన్నారు. ఈ ప్రకటన చేసే సమయంలో బైడెన్‌తోపాటు ఫైజర్ సీఈవో ఆల్బర్ట్ బౌర్లా కూడా ఉండే అవకాశం ఉంది. ఈ వ్యాక్సిన్ల కోసం లాభాలు లేని ధరను ఫైజర్‌కు అమెరికా చెల్లించనుంది. వీటిలో 20 కోట్లను ఈ ఏడాది, 30 కోట్లను వచ్చే ఏడాది ప్రపంచ దేశాలకు పంపిణీ చేయనుంది.



## యూఎన్ 'చెఫ్ డీ క్యాబినెట్' గా నాగరాజ్ నాయుడు



న్యూయార్క్ : ఐక్యరాజ్యసమితి (యూఎన్) 'చెఫ్ డీ క్యాబినెట్' గా నాగరాజ్ నాయుడు ఎన్నికయ్యారు. యూఎన్ 76 వ సమావేశానికి అధ్యక్షుడిగా నియమితులైన మాల్దీవుల విదేశాంగ మంత్రి అబ్దుల్లా షాహిద్ ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ఉప ప్రతినిధిగా ఉన్న కే నాగరాజ్ నాయుడును 'చెఫ్ డీ క్యాబినెట్'గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఐక్యరాజ్యసమితిలో ఇది ఒక ముఖ్యమైన పదవి. ఐరాసలో బ్యూరోక్రసీ 'చెఫ్ డీ క్యాబినెట్' నియంత్రణలో ఉంటుంది. ఆఫ్ఘనిస్తాన్ మాజీ విదేశాంగ మంత్రి డాక్టర్ జల్మై రసూల్‌పై నాగరాజ్ నాయుడు ఈ పదవికి పోటీ పడ్డారు. ఈ క్రమంలో నాయుడుకు 143 ఓట్లు లభించగా, రసూల్‌కు 48 ఓట్లు మాత్రమే వచ్చాయి. నియామకం అనంతరం నాగరాజ్ నాయుడు ప్రస్తుత జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు వోల్కాన్ బోజ్కిర్‌తో భేటీ అయ్యారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం అధ్యక్షుడి నాయకత్వంలో పనిచేసే అవకాశం తనకు లభించడం పట్ల నాగరాజ్ నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. కొత్త జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడైన అబ్దుల్లా షాహిద్ ఈ నెల 7 న అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. సెప్టెంబరులో ఆయన పదవీ బాధ్యతలు చేపడతారు. 'చెఫ్ డీ క్యాబినెట్' ఏ అంతర్జాతీయ సంస్థలోనైనా సీనియర్ బ్యూరోక్రాట్. సంస్థ ఉన్నత పదవిలో నియమితులయ్యే వారి వ్యక్తిగత కార్యదర్శిగా కూడా పనిచేస్తారు.

## ముంబైలో భవనం కూలి 11 మంది దుర్మరణం

ముంబై : మహారాష్ట్రలోని ముంబైలో విషాదం చోటు చేసుకున్నది. మలాడ్ వెస్ట్ ప్రాంతంలోని న్యూకలెక్టర్ కాంపౌండ్‌లో బుధవారం రాత్రి ఓ నివాస భవనం కూలిపోయింది. ఘటనలో 11 మంది మృతి చెందారు. మరో మంది ఎనిమిది గాయపడగా.. వారిని దవాఖానాకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వెంటనే సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మహిళలు, పిల్లలు సహా మరో 15 మందిని రక్షించి ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సమీపంలో ఉన్న రెండు




భవనాలు సైతం సరైన స్థితిలో లేనందున వాటిలో ఉంటున్న వారిని సైతం ఖాళీ చేయించి కూల్చివేసినట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇంకా శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనపై రాష్ట్ర మంత్రి అస్లాం షేక్ మాట్లాడుతూ భారీగా కురిసిన వర్షం కారణంగా భవనం కూలిపోయిందని తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, గాయపడిన వారిని హాస్పిటల్‌లో చేర్పించారన్నారు. శిథిలాల కింద ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా? లేదా? తెలుసుకునేందుకు శిథిలాల తొలగింపు పనులు జరుగుతున్నాయన్నారు.

### రుతుపవనాలతో భారీ వర్షం

ముంబైతో పాటు పరిసర ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల కారణంగా భారీ వర్షం కురిసిందని ఐఎండీ బుధవారం తెలిపింది. ఉదయం నుంచే ఆర్థిక రాజధానితో పాటు పలు ప్రాంతాలు వర్షానికి అనేక ప్రదేశాలు నీటితో నిండిపోయాయి. దీంతో లోకల్ మెట్రో సేవలకు అంతరాయం కలిగింది. శాంటా క్రజ్‌లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఆరు గంటల్లో 164.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు ఐఎండీ తెలిపింది.

## జగన్ ఢిల్లీ పర్యటన.. మళ్లీ రహస్యమేనా..?

ఢిల్లీ: కేంద్రమంత్రులు జవదేకర్, షెకావత్‌తో సీఎం జగన్ భేటీ అయ్యారు. రాత్రి 7 గంటలకు పీయూష్ గోయల్‌తో భేటీ అవుతారు. రాత్రి 9 గంటలకు కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షాతో భేటీ అవుతారు. ఎంపీ రఘురామకృష్ణరాజుపై సీఐడీ కేసు, పోలీసు కస్టడీలో దాడి ఘటన దేశవ్యాప్తంగా సంచలనం అవుతోంది. తనపై ఏపీ పోలీసులు అక్రమంగా రాజద్రోహం కేసు పెట్టారని, కక్షతోనే దాడి చేశారని కేంద్రమంత్రుల నుంచి గవర్నర్లు, సీఎంలకు, ఎంపీలకు లేఖలు రాశారు. రఘురామ వ్యవహారంలో



అన్ని వైపుల నుంచి విమర్శలు వస్తుండడంతో నష్ట నివారణ కోసం జగన్ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులోభాగంగానే ఢిల్లీ పర్యటన పెట్టుకున్నారు. అయితే సోమవారమే కలవాలని అనుకున్నా.. అమిత్‌షా అపాయింట్‌మెంట్ దొరకలేదు. వైసీపీ ఎంపీలు ఢిల్లీకి వచ్చి అందరినీ కలిసి అభ్యర్థించడంతో ఎట్టకేలకు జగన్‌కు అపాయింట్‌మెంట్‌లు ఇచ్చారు. మరోవైపు రఘురామ కేసుతో పాటు సీబీఐ బెయిల్ రద్దు అంశం కూడా జగన్‌ను వెంటాడుతోంది. వరుస పరిణామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జగన్ అన్నింటిపై అమిత్‌షాకు వివరణ ఇచ్చే అవకాశం ఉంది. అమిత్‌షా కంటే ముందు కేంద్రమంత్రులను కలుస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలను మాట్లాడుతారని, ప్రతిసారి వైసీపీ నేతలు చెబుతుంటారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి వినతిపత్రాలిస్తున్నామని ఏపీ ప్రభుత్వ వర్గాలు చెబుతున్నప్పటికీ.. ప్రతి పర్యటనకు రహస్య ఎజెండా ఉంటుందని విపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. సీఎం పర్యటనపై అనేక పుకార్లు వస్తున్నాయి. చాలా సందర్భాల్లో జగన్ ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలతో చర్చించిన అంశాలకు సంబంధించి.. ఏం చర్చించారనే విషయాలను బయటకు చెప్పలేదు. అయితే ఈసారి కొవిడ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అందించాల్సిన సహకారం.. వ్యాక్సిన్లు వీటన్నింటితో పాటు పోలవరానికి రావాల్సిన నిధులపై సీఎం చర్చిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి.

## సీఎం ఢిల్లీ పర్యటనపై ఎల్లోమీడియా రాద్ధాంతం చేస్తోంది: బొత్స

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో టీడీపీ, ఎల్లో మీడియా రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " టీడీపీకి నీచమైన ఆలోచనలు తప్ప.. సూచనలు ఇచ్చే అలవాటు లేదు. కరోనా కట్టడికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశాం" అని తెలిపారు. కాగా ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం జగన్ కాసేపటిక్రితమే ఢిల్లీకి చేరుకున్నారు. జగన్ వెంట ఎంపీలు మిథున్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, బాలశౌరి, సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారు. హోంమంత్రి అమిత్ షా, జల వనరుల శాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, రైల్వే శాఖ మంత్రి గోయల్ సహా పలువురు కేంద్ర మంత్రులను సీఎం జగన్ కలుసుకుంటారు. పోలవరం ప్రాజెక్ట్ పనులు సహా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చిస్తారు. సీఎం వైఎస్ జగన్ తిరిగి శుక్రవారం మధ్యాహ్నం తాడేపల్లి చేరుకుంటారు.



## ఏపీలో కొత్తగా 8,110 కరోనా కేసులు

అమరావతి: గత 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లో 97,863 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 8,110 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. నిన్న ఒక్కరోజే కరోనా బారిన పడి 67 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 11,763 కు చేరింది. గడిచిన 24 గంటల్లో 12,981 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 16 లక్షల 77 వేల 063 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బుధవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 99,057 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలో నేటి వరకు 2,01,37,627 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గత 24 గంటల్లో జిల్లాల వారీగా నమోదైన కరోనా కేసులు వివరాలు.. శ్రీకాకుళం- 461, విజయనగరం- 280, విశాఖ- 502 ,తూ.గో- 1,980, ప.గో- 837, కృష్ణా- 339, గుంటూరు- 520, ప్రకాశం- 711, నెల్లూరు- 391, చిత్తూరు- 974,వ అనంతపురం- 960, కర్నూలు- 338, వైఎస్ఆర్ జిల్లా- 582 కేసులు నమోదయ్యాయి.



## పగ తీర్చుకోవాలని తప్ప.. వ్యాక్సినేషన్‌పై శ్రద్ధ లేదు: హర్షకుమార్

రాజమండ్రి: కరోనా వ్యాక్సినేషన్‌లో సరైన విధానం లేకపోవటం వల్ల వ్యాక్సినేషన్ ప్రక్రియ సక్రమంగా జరగటం లేదని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత హర్షకుమార్ పేర్కొన్నారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కరోనా మరణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. నిరుపేదలు రిజిస్ట్రేషన్ ఎక్కడ చేయించుకోవాలని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వానికి పగ తీర్చుకోవాలన్న ఆలోచన తప్ప వ్యాక్సినేషన్‌పై శ్రద్ధ లేదని హర్షకుమార్ విమర్శించారు. వ్యాక్సినేషన్ కోసం వలంటీర్లతో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో ఎమ్మెల్యేలు కాంట్రాక్టర్లుగా మారి ఇసుకను దోచుకున్నారని... వైసీపీ పాలనలో ఇసుకలో సరైన విధానమే లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇసుకను రెడ్డిల చేతుల్లో పెట్టారన్నారు. విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిల కనుసన్ననల్లో ఇసుక దోపీడీ జరుగుతోందని హర్షకుమార్ విమర్శించారు. జగన్ తీరు పట్ల భవన నిర్మాణ కార్మికులు అల్లాడిపోయారన్నారు. గోదావరిలో ఇసుక తవ్వుతున్న కూలీలు టన్ను ఇసుకకు 475 రూపాయిలు చాలంటే కాంట్రాక్టర్ టన్ను ఇసుకను 675 కు అమ్ముతున్నారని హర్షకుమార్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

**శుక్రవారం 11 జూన్ 2021**

## మావోయిస్టులకు కరోనా టెన్షన్

దండకారణ్యంలో మావోయిస్టులకు కరోనా టెన్షన్ పెడుతోంది. అడవుల్లో మావోయిస్టు అగ్రనేతలను సైతం ఈ మహమ్మారి వదలడం లేదు. అగ్ర నేతలు కరోనా పాజిటివ్ తో పోరాడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. పదుల సంఖ్యలో మావోయిస్టులు కరోనాతో అస్వస్థతకు గురైనట్లుగా ప్రచారం జరుగుతుంది. ఒకవైపు పోలీసులు.. మరోవైపు కరోనా మహమ్మారి మావోయిస్టులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కానీ పోలీసులు మాత్రం కరోనా సాకుతో మావోయిస్టులను అరెస్ట్ చేయాలని ప్రచారం చేస్తున్నారు. కోవర్టులు ద్వారా ఆహరం లో విషం కలిపి పంపుతున్నారని , అందుచేతనే అనారోగ్యం పాలవుతున్నట్లు దక్షిణ సబ్ జోనల్ బ్యూరో మావోయిస్టు పార్టీ ప్రకటన చేసింది.తెలంగాణ సరిహద్దులోని మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లోని బస్తర్, బీజాపూర్, సుక్మా, చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాల్లోని దండకారణ్యంలో రెండు దశాబ్దాలుగా మావోయిస్టులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కరోనా సెకండ్ వేవ్ తీవ్రంగా ఉండడంతో మావోయిస్టులకు కూడా కరోనా వ్యాపించినట్లుగా ప్రచారం జరుగుతోంది. కరోనా చికిత్స కోసం దండకారణ్య స్పెషల్ జోనల్ డివిజన్ కార్యదర్శి శోభరాయ్ అలియాస్ మధుకర్‌తో పాటు ఓ బాలుడు జూన్ 1వ తేదీన వరంగల్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు వస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి సమాచారం మేరకు మావోయిస్టు అగ్రనేతలు 12 మందికిపైగా కరోనాతో బాధపడుతున్నట్లుగా పోలీసులు అంచనాకు వచ్చారు.కరోనా బారీన పడిన అగ్రనేతల్లో కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ , తిప్పరి తిరుతి ఆలియాస్ దేవుజీ , యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ , చొక్కారావు అలియాస్ దామోదర్ , కటకం రాజిరెడ్డి అలియాస్ ధర్మన్న,కట్టా రాంచందర్ రెడ్డి అలియాస్ వికల్స్, ములా దేవేందర్ రెడ్డి అలియాస్ మాస దడ, కున్‌కటి వెంకటయ్య అలియాస్ వికాస్, ముచ్చకి ఉజల్ అలియాస్ రఘు, కొడి మంజుల అలియాస్ నిర్మల, పూసం పద్మ , కాకర్ల సునీత అలియాస్ బుర్రా కరోనా బారీన పడినట్లు సమాచారం. దీంతో కరోనా బారిన పడిన నేతలు పోలీసులు ముందు లొంగిపోతే తామే వైద్య పరీక్షలు చేయిస్తామని ప్రకటించడం తో మావోయిస్టు పార్టీ ఒంటికాలుతో లేచింది. కరోనా ను సాకు చూపి మావోయిస్టు లను అరెస్ట్ చేయాలనీ చూస్తుందని , మావోయిస్టు నేత మధుకర్ అలియాస్ శోభ్రాయ్ ను పోలీసులు హత్య చేసి కరోనా తో చనిపోయినట్లు ప్రకటన చేశారని లేఖ లో పేర్కొన్నారు. మధుకర్ తోపాటు మే 27 తేదీన పీఎల్జీఏ కి చెందిన ప్లాటూన్ కమాండర్ గంగాళ్ ను కూడా పోలీసులు ఇదే తరహా లో హత్య చేశారని మావోయిస్టు పార్టీ ఆరోపిస్తుంది ..అత్యంత తీవ్ర అనారోగ్యపాలైనందున దండకారణ్యం నుండి మెరుగైన వైద్య సేవల కోసం బయటికి పంపితే ఇద్దరు మావోయిస్టులను అవమానవీయంగా పోలీసులు కరోనా పేరుతో హత్య చేశారని సంచలన ఆరోపణలు చేసింది మావో యిస్టు పార్టీ .. ఇక పౌర సంఘాల నేతలు సైతం మావోలకు కరోనా అంశం పై స్పందించారు. మావోయిస్ట్ అగ్రనేతలు కరోన బారీన పడ్డారు అనేది ప్రచారమా , వాస్తవం అనేది తెలియాలని , కరోనా సాకు తో మావోయిస్టులు ఉద్యమాన్ని అణచివేయలని పోలీసులు చూస్తున్నారన్నారు పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్. తాత్కాలికంగా పోలీసులకు ఫలితం కనిపించవచ్చు, కానీ దీర్ఘకాలం లో సమాజం ఒప్పుకోదన్నారు. దండకారణ్యంలో అగ్ర నేతలకు కరోనా సోకిందనేది ప్రచారం మాత్రమేనని, దాన్ని సాకుగా చూపెట్టి మావోలు లొంగిపోవాలని పోలీసులు చెపుతున్నారు అన్నారు .. జెనివా ఒప్పందం ప్రకారం రసాయన పదార్థాలు వాడకూడదని అంతర్జాతీయ యుద్ధ నియమాలు తుంగలో తొక్కుతున్నారన్నారు.కరోనా తో పాటు ఇతర ఆరోగ్య సమస్యల తో బాధపడుతున్న వారికి చికిత్స అందించే విషయంలో మావోయిస్టు పార్టీ అధినాయకత్వం తీవ్రమైన ఆంక్షలు విధిస్తోందన్న ప్రచారం జరుగుతోంది. మరీ తీవ్రంగా? అదీ ప్రాణాపాయంలో ఉన్న సమయంలోనే చికిత్సకు అనుమతి ఇస్తుండడంతో పరిస్థితి విషమించి ప్రాణాలమీదకు వస్తోందని తెలిసింది. తాజాగా అరెస్ట్ అయిన మావోయిస్టులు పోలీసులకు అక్కడి పరిస్థితిని పూస గుచ్చినట్టు వివరించినట్టు, దీంతో మావోయిస్టుల ఉనికి మొత్తం పోలీసులు చేతుల్లో ఉన్నట్లు సమాచారం. ఇది పార్టీ కి రాబోయే రోజుల్లో తీవ్ర నష్టం చేకూర్చడం ఖాయమన్న అంచనాలో పోలీసులు ఉన్నారు. ఏదిఏమైనా దశాబ్దాలుగా సాయుధ పోరాటం చేస్తున్న మావోయిస్టులకు ?కరోనా మహమ్మారి శరాఘాతం గా మారుతోంది.

## హంగులు దిద్దుకున్న వైజాగ్ ఎయిర్‌పోర్టు

విశాఖపట్టణం, జూన్ 10, (న్యూస్ పల్స్)విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం.. ఇండియన్ నేవీ విమానాశ్రయం ఐఎన్ఎస్ డేగాలో పౌర విమానయాన సేవలందిస్తోంది. మొత్తం 349.39 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయం విస్తరించి ఉంది. దేశంలో ఎక్కడా లేని ఒక ప్రత్యేకమైన గుర్తింపు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉంది.సాధారణంగా దాదాపు ప్రతి విమానాశ్రయంలోనూ రన్‌వేకు రెండు వైపుల నుంచి టేకాఫ్, ల్యాండింగ్స్ జరుగుతుంటాయి. కానీ విశాఖలో మాత్రం విమానాశ్రయానికి ఓవైపు పెద్ద కొండ ఉండటం వల్ల ఒకవైపు నుంచి మాత్రమే రాకపోకలు సాగుతున్నాయి. 1981లో రోజుకు ఒక విమానం ద్వారా ప్రారంభమైన పౌర సేవలు ప్రస్తుతం సుమారు 70 వరకు చేరుకున్నాయి. అయితే కోవిడ్ కారణంగా కేవలం 14 సర్వీసులు మాత్రమే ప్రస్తుతం నడుస్తున్నాయి. భవిష్యత్తులో రాకపోకలు పెంచేందుకు విస్తరణ పనులు చేపట్టారు. బ్రిటిష్ కాలంలో 4 పార్కింగ్ బేస్ ఉండేవి. తరువాత మరో 6 పార్కింగ్ బేస్‌లు నిర్మించారు. గతంలో ఉండే రన్‌వే వినియోగించే అవకాశం లేదు. ఇప్పుడు ఒకే రన్‌వే ఉంది. దాన్ని నేవీతో సంయుక్తంగా వినియోగిస్తున్నారు. రన్‌వేపై వెళ్లేందుకు ఎవరికీ అనుమతి లేదు. నేవీ టవర్ కంట్రోల్ రూమ్‌తో రన్‌వేను అనుసంధానం చేశారు. ఎవరైనా రన్‌వే పైకి వెళ్లాలంటే రక్షణ దళ అనుమతి తప్పనిసరి. యాప్రాన్, హ్యాంగర్స్, టెర్మినల్‌కు రన్‌వేలో ఉన్న విమానంతో అనుసంధానమయ్యేలా ఉండే ట్యాక్సీ వేలు కూడా నేవీ భాగంలోనే ఉన్నాయి. అందుకే ప్రత్యేకంగా మరో కొత్త ట్యాక్సీ ట్రాక్ నిర్మించారు. దీనికితోడు తాజాగా మరో ఆరు పార్కింగ్ బేస్‌ల నిర్మాణం కూడా పూర్తయింది. ఇవి త్వరలోనే ప్రారంభించనున్నారు. ఇవి కూడా అందుబాటులోకి వస్తే మొత్తం 16 విమానాలు ఏక కాలంలో రాకపోకలు సాగించే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ స్థాయి సదస్సులకు వేదికగా విశాఖ నిలుస్తోంది. దీనికితోడు రాష్ట్ర కార్యనిర్వాహక రాజధానిగా కొత్త రూపుదాల్చనుంది. దీనికితోడు కొత్త రైల్వే జోన్, పోర్టులు, జలరవాణా, జాతీయ రహదారులు ఇలా విశిష్ట సామర్థ్యమున్న విశాఖకు కాలానుగుణంగా కనెక్టివిటీ పెరగాల్సి ఉంది. అయితే నేవీ ఇచ్చిన స్లాట్స్ ప్రకారం 85 విమానాల కంటే ఎక్కువ నడపలేని పరిస్థితి ఉంది. ఈ స్లాట్ పెరగాలంటే.. లిమిటేషన్ పెంచాలి. అది పెరగాలంటే రన్‌వే హ్యాండ్లింగ్ కెపాసిటీ పెంచాలి,

ఆక్యుపేషన్ టైమ్ తగ్గించాలి. రన్‌వే ఎఫిషియన్సీ పెంచాలి. ఇది పెరిగితే ప్రస్తుతం ఉన్న గంటకు 10 రాకపోకల స్లాట్‌లో పాసింజర్ విమానాల సామర్థ్యం 16కి పెరుగుతుంది.రన్‌వే హ్యాండ్లింగ్ పెరిగి, ఆక్యుపేషన్సీ తగ్గి 50 శాతం పెరిగితే ప్రస్తుతం ఉన్న 85 విమానాల రాకపోకల కెపాసిటీ 123కు చేరుకుంటుంది. దీనివల్ల ఇతర ప్రాంతాలకూ కనెక్టివిటీ ఫ్లైట్స్ పెరుగుతుంది. అప్పుడు ఇతర నగరాలకు రాకపోకలు విస్తరించవచ్చు. డిమాండ్ ఉన్న సమయాల్లో మరిన్ని ఫ్లైట్స్‌కు స్లాట్స్ కేటాయించవచ్చు. ట్యాక్సీ ట్రాక్‌ల పెంచినప్పుడు ల్యాండింగ్ అయ్యే విమానాలు.. వెంట వెంటనే వచ్చి వెళ్లిపోయే అవకాశముంది. దీని వల్ల రన్‌వేపై ఆక్యుపెన్సీ టైమ్ తగ్గుతుంది. దీనివల్ల స్లాట్ సామర్థ్యం మరింత పెరిగి పాసింజర్ ఫ్లైట్స్ పెరగవచ్చు. కొత్త ట్యాక్సీట్రాక్ నిర్మాణం పూర్తి కావడంతో దీనికి మార్గం సుగమమైం

## భారీగా ఆస్తి పన్ను బాదుడు

విజయవాడ, జూన్ 10, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌లో ఆస్తి పన్ను పెంపు ఇప్పుడు కలకలం రేపుతోంది. ప్రభుత్వ వర్గాలు మంత్రి బొత్స సత్యనారాయణ లాంటివాళ్లు ఆస్తి పన్నును 0.15 శాతం మాత్రమే పెంచుతున్నామని దీనికి ఇంత రగడ ఎందుకని ప్రశ్నిస్తున్నాయి. కానీ ఇక్కడ విషయం 0.15 శాతం పెంపు కాదు. మొత్తం ఆస్తి విలువలో ఆస్తి పన్నును ఏటా 0.15 శాతం వసూలు చేస్తారు. ప్రతీ ఏటా ఆస్తి విలువ పెంచుతుంటాంటారు. అంటే.. ఈ 0.15 అలాగే ఉంటుంది. కానీ పన్ను మాత్రం పెరుగుతూ ఉంటుంది. ఇప్పుడీ పన్నులు.. ప్రజల్లో చర్చనీయాంశం అవుతున్నాయి. కేంద్రం ఇచ్చేరుణాల కోసం సంస్కరణలు అమలు చేస్తున్నఏపీ పట్టణ ప్రజలపై పన్నులు పెంచేందుకు కూడా అంగీకరించింది. అందులో భాగంగా ఆస్తి విలువలో 0.15 శాత పన్నును విధించాలని నిర్ణయించింది. ఎన్నికల సమయంలో నిర్ణయాన్ని వాయిదా వేసిన ప్రభుత్వం.. ఇప్పుడు.. అన్ని చోట్లా అమలు ప్రారంభించింది. ఎక్కడికక్కడ నోటిఫికేషన్లు ఇస్తున్నారు. నోటిఫికేషన్‌లో నివాస గృహాలపై ఆస్తి విలువపై 0.15 శాతం, వాణిజ్య, నివాసేతర భవనాలపై 0.3 శాతం, ఖాళీ స్థలాలపై 0.5 శాతం పన్ను వేస్తారు. ఆస్తి మూలధన విలువలో 0.15 శాతం పన్ను విధిస్తారు అంటే ? ఆ ఆస్తి ముప్పై ఏళ్ల క్రితం కొనుగోలు చేసినప్పటికీ.. ఇప్పుడు ఉన్న విలువ ఆధారంగా పన్ను నిర్ణయిస్తారన్నమాట. ఉదాహరణకు విశాఖలో ఓ వ్యక్తి 30 ఏళ్ల కిందట..ఓ వ్యక్తి 30వేలు పెట్టి ఇల్లు స్థలం కొనుక్కున్నారనుకుంది. ఇప్పుడు ఆ స్థలం విలువ మూడు కోట్లు అయి ఉంటుంది. అందులో ఇల్లు ఉంటే 0.15 శాతం.. ఖాళీ స్థలమే అయితే 0.5 శాతం పన్ను కట్టాలి. మూడు కోట్ల స్థలానికి పన్ను యాభై వేలు అన్నమాట. ఇంటికి వచ్చేసరికి వేరే లెక్క ఉంటుంది. అందులో కట్టిన చదరపు అడుగుల వారీగా లెక్క వేసి.. ఇప్పటి విలువను లెక్కించి మరీ.. పన్నువసూలుచేస్తారు. అంటే ప్రస్తుతం ఉన్న పన్ను.. దాదాపుగా పది రెట్లు పెరుగుతుంది. రూ. వెయ్యి కట్టే వారు.. పదివేలు కట్టాల్సి ఉంటుంది. ఈ విధానంలో ప్రభుత్వం డబ్బులు కావాల్సినప్పుడల్లా భూములు, కట్టడాల విలువను పెంచుకుంటూపోతే చాలు ప్రజల నుంచి కావాల్సినంత ఇంటి పన్ను పిండుకోవచ్చు. ఇప్పటికే ప్రతి ఏటా భూముల రేట్లు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఏపీలో ఆస్తి ఉన్న ప్రజలు.. అది గ్రామమైనా పట్టణమైనా.. నగరమైనా.. పన్నులు పది రెట్లు ఎక్కువగా కట్టడానికి సిద్ధపడాల్సిందే

## కంచుకోటకు బీటలు

ఏలూరు, జూన్ 10, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఆ పార్టీ ఆవిర్భావించక ఇక్కడ ఒక్కసారే ఓటమి పాలైంది. 1983 నుంచి 2019 వరకు చూసుకుంటే టీడీపీ కేవలం 2004 ఎన్నికల్లోనే ఓడిపోయింది. మిగిలిన 8 సార్లు ఉండి నియోజకవర్గంలో టీడీపీ జెండానే ఎగిరింది. రాష్ట్రంలో జగన్ గాలి బలంగా ఉన్నా సరే 2019 ఎన్నికల్లో ఉండిలో మాత్రం టీడీపీ గెలిచింది. దీనిని బట్టే ఉండి టీడీపీ ఎంత కంచుకోటో తెలుస్తోంది. వైఎస్ ప్రభంజనం అయినా.. జగన్ సునామీ అయినా ఉండిలో సైకిల్ సత్తా చెక్కు చెదర్లేదు. ఇక్కడ గత ఎన్నికల్లో టీడీపీ తరపున మంతెన రామరాజు విజయం సాధించారు. అయితే తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రాంబాబు, కాస్త సైలెంట్‌గానే పనిచేసుకుంటూ వెళుతున్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నారు.అదే సమయంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉంటూ, అధికార వైసీపీపై దూకుడుగా వెళ్ళడం లేదు. ఇటు టీడీపీలో ఉంటూనే, అటు వైసీపీతో కూడా మంచిగానే ఉంటున్నారు. ప్రభుత్వంపై దూకుడుగా విమర్శలు చేయడం లేదు. నియోజకవర్గంలో పనులు చేయించుకోవడానికి జిల్లాలోని వైసీపీ నేతలతో సఖ్యతతోనే ఉంటున్నారన్న ప్రచారం స్థానికంగా టీడీపీ వర్గాల్లోనే వినిపిస్తోంది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఇస్తామని టీడీపీ ఆఫర్ చేయడంతో ఆర్థికంగా భారీ రిస్క్ చేసే రాంబాబు గెలిచారు. అయితే ఇప్పుడు ప్రభుత్వంతో సై అనేలా వ్యవహరిస్తే ఆయన వ్యాపారాలకు కూడా పెద్ద రిస్కే అన్న నిర్ణయానికి ఆయనే వచ్చేశారట.జిల్లాలో తన సామాజిక వర్గానికే చెందిన మంత్రి రంగరాజుతో లోపాయికారిగా సఖ్యతతో ఉంటున్నట్టు కూడా వార్తలు గుప్పుమంటున్నాయి. అయితే ఇలా కర్ర విరగకూడదు?పాము చావు కూడదు అన్న చందంగా నడుస్తున్న రాంబాబుకు నెక్ట్ ఎన్నికల్లో ఉండి సీటు దక్కుతుందా లేదా అనేది కాస్త డౌట్‌గానే ఉంది. ఎందుకంటే 2009, 2014 ఎన్నికల్లో ఉండి నుంచి వేటుకూరి శివరామరాజు(కలవపూడి శివ) టీడీపీ తరుపున గెలిచారు. ఇక 2019 ఎన్నికల్లో రాజకీయ సమీకరణాల్లో భాగంగా చంద్రబాబు, శివని నరసాపురం ఎంపీగా బరిలో దించారు. ఇక శివకు సోదరుడు వరుసయ్యే రాంబాబుని ఉండిలో నిలబెట్టారు.ఇక జగన్ వేవ్‌లో శివ ఓటమి పాలయ్యారు. ఈయనపై రఘురామకృష్ణంరాజు విజయం సాధించారు. అయితే ఓడిపోయిన దగ్గర నుంచి శివ పొలిటికల్ స్క్రీన్‌పై కనిపించడం లేదు. సొంత వ్యాపారాలు ఉండటంతో సైలెంట్‌గా ఉంటున్నట్లు తెలుస్తోంది. అయితే వచ్చే ఎన్నికల్లో శివ మళ్ళీ ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ తరుపున ఎమ్మెల్యేగానే పోటీ చేస్తానని చెప్పేశారని తెలుస్తోంది. శివకు మళ్ళీ నరసాపురం నుంచి పోటీ చేసే ఉద్దేశం లేదన్నది క్లారిటీ వచ్చేసింది. శివ వస్తే రాంబాబు సైడ్ అవ్వాల్సిందే. మరి చంద్రబాబు ఆ ఇద్దరి నేతలకు ఎలా న్యాయం చేస్తారో చూడాలి. ఏదేమైనా ఉండి టీడీపీలో ఈ ఇద్దరు నేతల రాజకీయం కొత్తగా మారేలా కనిపిస్తోంది.

## వారుసుడి ఎంట్రీ

శ్రీకాకుళం,జూన్ 10, (న్యూస్ పల్స్)వచ్చే 2024 ఎన్నికల్లో గతంలో ఎక్కువ మంది నేతలు తమ తమ వారసులను రంగంలోకి తీసుకువచ్చేందు కు ప్లాన్ చేసుకుంటున్నారు. ఇటు టీడీపీలోను, అటు.. వైసీపీలోను కీలక నేతలు అందరూ వచ్చే ఎన్నికల్లో తమ వారసులను రాజకీయాల్లోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వారిలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం, మంత్రి ధర్మాన కృష్ణదాస్ ముందువరుసలో ఉన్నారు. నరసన్నపేట నియోజక వర్గం నుంచి గత ఎన్నికల్లో వైసీపీ తరఫున విజయం దక్కించుకున్నారు ధర్మాన కృష్ణదాస్.వాస్తవానికి నరసన్నపేట నియోజకవర్గంపై ధర్మాన కృష్ణదాస్ కు మంచి పట్టుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇక్కడ అనేకసార్లు విజయం సాధించారు. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై విజయం సాధించారు. దివంగత వైఎస్ కు సన్నిహితుడుగా పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ స్థాపనతో జిల్లా నుంచి వైసీపీలోకి వెళ్లిన తొలినాయకుడిగా కూడా కృష్ణదాస్ గుర్తింపు సాధించారు. కృష్ణదాస్ భార్య పద్మప్రియ జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు. ఈ క్రమంలోనే 2012లో వచ్చిన ఉప ఎన్నికలో వైసీపీ తరఫున విజయం సాధించారు. ఇక, 2014లో మాత్రం ఆయన వైసీపీ తరఫున పోటీ చేసినా.. ఓడిపోయారు.కానీ, పట్టుబట్టి.. 2019లో దాస్ ఇక్కడ విజయం దక్కించుకోవడంతోపాటు.. జగన్ మంత్రివర్గంలోనూ చోటు సంపాదించుకున్నారు. కొన్నాళ్ల కిందట.. ఆయనను డిప్యూటీ సీఎంగా కూడా ప్రమోట్ చేశారు ముఖ్యమంత్రి. జగన్ ధర్మాన కృష్ణదాస్ ను ఎంతలా నమ్మారంటే సీనియర్ నేత, మాజీ మంత్రి అయిన ధర్మాన ప్రసాదరావును కాదని మరీ కృష్ణదాస్‌కు మంత్రి పదవి ఇచ్చారు. అయితే.. వచ్చే ఎన్నికల్లో తాను పోటీకి దూరంగా ఉంటున్నట్టు కొన్నాళ్ల కిందట.. కృష్ణదాస్ ప్రకటించారు. ఈ క్రమంలో తన వారసుడు.. ద్ల వైసీపీ తరఫున పోటీకి నిలబెట్టాల ని భావిస్తున్నారు. దీనికి సంబంధించి.. సీఎం జగన్.. కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.ఇక, కృష్ణ చైతన్య విషయానికి వస్తే.. కొన్నాళ్లుగా నియోజకవర్గంలోనే కాకుండా.. జిల్లా రాజకీయాల్లోనూ ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా టీడీపీపై సంచలన కామెంట్లు కూడా చేస్తున్నారు. గెలిచిన నేతలు మాత్రమే అభివృద్ధి చేస్తారని.. ఓడిపోయిన నేతలను ఎవరూ పట్టించుకోరు.. అంటూ.. చురకలు అంటిస్తున్నారు. నియోజకవర్గంలో అధికారుల బదిలీలు, ఇతర వ్యవహారాలు, కాంట్రాక్టులు అన్ని ఆయన కనుసన్నల్లోనే నడుస్తున్నాయన్న టాక్ వచ్చేసింది. ఇక, పార్టీ కార్యక్రమాల్లోనూ ఇటీవల కాలంలో కృష్ణ చైతన్యే పాల్గొంటున్నారు. ఈ పరిణామాలను గమనిస్తే.. వచ్చే ఎన్నికల్లోనే ధర్మాన కృష్ణదాస్ వారసత్వాన్ని కృష్ణ చైతన్య కొనసాగించే ఛాన్సులే ఎక్కువ ఉన్నాయంటున్నారు పరిశీలకులు.

## పరీక్షలకే పరీక్ష

విజయవాడ, జూన్ 10(న్యూస్ పల్స్)జగన్ ఏం చదివారో మాకు తెలియదు అని టీడీపీ ఎపుడూ ఎకసెక్కమాడుతుంది. ఆయన చదువు టీడీపీకే కాదు ఏపీ జనాలకు కూడా ఇపుడు అనవసరం. ఆ మాటకు వస్తే రాజ్యాంగం ప్రకారం ప్రజా ప్రతినిధిగా పోటీ చేయడానికి ఉన్నత చదువులు చదవాలని నిబంధన కూడా ఏదీ లేదు. పైగా జగన్ ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడుతారు. ఆయన ఉత్తమ పారిశ్రామికవేత్తగా కూడా ఉన్నారు. అది చాలు. కానీ ఏదో విమర్శ చేయాలని చూసే విపక్షాలకు మాత్రం జగన్ గురించి అన్నీ కావాలి. కోడి గుడ్డు మీద వెంట్రుకలు పీకాలని వారికి సరదా. పోనీ వారికేదో ఆ దురద ఉందనుకుంటే సబబే కానీ మధ్యలో జగన్ కి ఎందుకు ఇలా పరీక్షలు చదువూ అంటూ పట్టుకుంది అన్నదే వైసీపీలోని జగన్ వీరాభిమానుల ఆవేదన.ఏపీలో ఏదో ఒక దాన్ని పట్టుకుని రాద్ధాంతం చేయడానికి విపక్షాలు రెడీగా ఉంటాయి. గత మూడు నెలలుగా చినబాబు ఒకే ఒక సబ్జెక్ట్ పట్టుకుని అలా ముందుకు పోతున్నాడు. ఆయన చేస్తున్నది రాజకీయమని ఒక వైపు అంటూనే చినబాబుకు అలా చాన్స్ ఇచ్చేస్తూ వైసీపీ అడ్డంగా దొరికిపోతోంది. ఏపీలో టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణ అన్నది కూడా ఇపుడు పొలిటికల్ అజెండాగా మారిపోయింది. ప్రతీ నాలుగు రోజులకు ఒకసారి విద్యా మంత్రి ఆదిమూలపు సురేష్ పరీక్షలు పెట్టి తీరుతామని గర్జిస్తారు. ఆ వెంటనే లోకేష్ బాబు రంగంలోకి దిగిపోయి ఎలా పెడతారో చూస్తామని హూంకరిస్తారు. మొత్తానికి ఇదొక పొలిటికల్ గేన్ గా పార్టీలకు ఉన్నా ఈ మధ్యన నలిగి అటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా తెగ వేదన చెందుతున్నారు.దేశంలో ప్రతిష్టాత్మకమైన సీబీఎస్ఈనే కేంద్రం రద్దు చేసింది. అదే విధంగా దేశంలోని అనేక రాష్ట్రాలు కూడా టెన్త్ ఇంటర్ పరీక్షలు రద్దు చేశారు. పొరుగున ఉన్న తెలుగు రాష్ట్రం అదే పని చేసింది. కానీ ఒక్క జగన్ సర్కార్ మాత్రమే విద్యార్థులు వారి భవితవ్యం అంటూ దీర్ఘాలు తీస్తూ విపక్షాల రొచ్చు రాజకీయానికి ఊపిరి పోస్తోంది అన్న మాట అయితే ఉంది. నిజానికి కరోనా రెండవ దశ దూకుడు చూశాక పరీక్షలు వద్దురా బాబూ అన్నట్లుగానే విద్యార్థుల మూడ్ ఉంది. తల్లిదండ్రులు కూడా డిటో. మరి వారికి తెలియదా తమ బిడ్డల ఫ్యూచర్ ఎలా ఉండాలో. ముందు బతికుంటే బలుసాకు తింటామన్న తీరున బయట వాతావరణం ఉంటే పరీక్షలు నిర్వహించి రేపటి ఉజ్వలమైన భవిష్యత్తుకు బాటకు వేస్తామని జగన్ సర్కార్ చెప్పడం వింతగానే ఉంది కదా.ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం అంటోంది. టెన్త్ పరీక్షలే అన్నింటికీ కొలమానం కాబట్టి పాస్ చేయలేమని చెబుతోంది. జగన్ ప్రభుత్వం ఆదర్శవంతమైన విధానాన్ని ఎంచుకున్నా ప్రజల మూడ్ కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కదా ఎంత కేసులు తగ్గినా కూడా కరోనా భయం అన్నది ఆగస్ట్ నాటికి పూర్తిగా పోతుంది అని ఎవరూ చెప్పలేరు. ఇక పెద్ద ఎత్తున విద్యార్థులు పరీక్షలు రాస్తే ఇందులో ఏ కొద్ది మందికైనా కరోనా సోకితే తప్పు అంతా జగన్ దే అంటూ మొత్తం బురద పూయడానికి ఎటూ విపక్షం రెడీగా ఉంటుంది. అంటే ఒక వైపు పొలిటికల్ గా రిస్క్ అని తెలిసి జగన్ సర్కార్ పరీక్షల నిర్వహణకు దూకుడు చేయడం మంచిది కాదు అన్నది పార్టీలో కూడా వినిపిస్తున్న మాట. మొత్తానికి ఇవి విధార్థులు రాసే పరీక్షలుగా లేవు, జగనే పరీక్షలు రాస్తున్నట్లుగా ఉంది అని వైసీపీ నేతలు మధనపడుతున్నారంటే పాయింటేగా మరి.

## అక్కరకు వస్తున్న కిసాన్ రైలు



విజయనగరం, జూన్10, (న్యూస్ పల్స్)ఆరుగాలం కష్టం పడి పండించిన మామిడి పంటకు గిట్టుబాటు ధర దక్కని రైతులకు కిసాన్ రైలు అక్కరకు వస్తోంది. మార్కెట్ సదుపాయం లేకపోవడంతో పంటను అమ్ముకోవడానికి అన్నదాత దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ రైలును ప్రారంభించింది. రవాణా ఛార్జీల్లో రూ.50శాతం రాయితీ కల్పించారు. వాస్తవానికి ఆ రాయితీ కూడా రైతులకు అందలేదు. గిటుబాటు ధరరాక, రవాణా రాయితీ లభించిక రైతన్న నిండా మునిగిపోతున్నాడు.. ప్రభుత్వం తమ గోస చూసైనా పంట కొనుగోలు చేసి ఆదుకోవాలని మామిడి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.మామిడి ఉత్పత్తిలో రాష్ట్రంలో విజయనగరం జిల్లా మూడో స్థానం. సుమారు 1.10 లక్షల ఎకరాల్లో సువర్ణరేఖ, బంగినపల్లి, పనుకులు, పరియాలు, రసాలు, కోలంగోవ, కలెక్టర్ తదితర రకాల మామిడి కాయలు సాగవుతున్నాయి. వీటిలో పనుకులు, పరియాలు, సువర్ణరేఖ, బంగినపల్లి అధికంగా సాగువుతుంది.గతేడాది ఎకరాకు ఐదు టన్నుల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోడంతో పూత దశలోనే నష్టం రావడంతో ఎకరాకు రెండు టన్నుల దిగుబడి వచ్చింది. తీరా పంటను అమ్ముకుందామనుకున్న సమయంలో కరోనా రెండోదశ వచ్చి పడింది. దీంతో పలు రాష్ట్రాలు లాక్‌డౌన్, కర్ఫ్యూ విధించడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. ఇదే అదునుగా భావించిన స్థానిక దళారులు తక్కువ ధరకు మామిడిని కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో మామిడిరైతులను ఆదుకునే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కిసాన్‌రైలును ప్రవేశపెట్టింది. ఢిల్లీలోని అజాపూర్ మార్కెట్‌కు పంటను తరలిస్తుంది. రవాణా ఛార్జీల్లో రూ.50 శాతం రాయితీని కల్పిస్తారు. ఏప్రిల్ నుంచి మే మొదటి వారం వరకు పదివేల మెట్రిక్ టన్నులు ఎగుమతి చేశారు. కానీ, కేంద్రం మే నెల రెండో వారంలో రవాణా రాయితీ ప్రకటించింది. దీనివల్ల అప్పటికే ఎక్కువ మంది రైతులు తమ సరుకును దళారులు విక్రయించారు. రవాణా ఛార్జీలు కూడా వారికే లభించాయి. ఇటు గిట్టుబాటు ధర లభించక, కేంద్రం ఇస్తున్న రవాణా ఛార్జీలు అందక అన్నదాత తీవ్రంగా నష్టపోతున్నాడు. స్థానిక మార్కెటులు ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.కరోనాను బూచిగా చూపి దళారులు రూ.1000 నుంచి రూ.1200 విలువ చేసే సువర్ణరేఖ 16 కేజీల బాక్సును రూ.800మించి కొనుగోలు చేయడం లేదు. మే నెల ఆరంభం నాటికి గరిష్టంగా రూ.500కు తగ్గించారు. రూ.1000 విలువ చేసే బంగినపల్లి ఏప్రిల్‌లో గరిష్టంగా రూ.600, మే నెలలో రూ.400కు తగ్గించి కొనుగోలు చేశారు. ఇక కోలంగోవ, కలెక్టర్ వంటి రకాలు విక్రయించే రైతులకు తిరిగి నష్టం వస్తుంది.నాలుగైదేళ్లగా నాతోపాటు మామిడి రైతులంతా నిలువ దోపిడీకి గురౌతున్నారు. సాగుతోపాటు పక్వానికి వచ్చిన కాయలు కోసి, వాటిని బాక్సుల్లో విక్రయించే క్రమంలో రూ.లక్షల్లో పెట్టుబడి పెడుతున్నాం. కానీ, స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో దళారులకు విక్రయించాల్సివస్తోంది. గతంలో కొంత నయం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 50శాతం రవాణా ఛార్జీ వల్ల రైతులకు ఒరిగిందేమీ లేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే స్థానికంగా ప్రభుత్వ మార్కెట్ సదుపాయం కల్పించాలి.

# ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టులు

ఏలూరు, జూన్ 10, (న్యూస్ పల్స్) సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ప్రభుత్వం నిర్ధేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. మార్చి ఆఖరులోపు రాష్ట్రంలోని ఆరు ప్రాజెక్టుల్నీ పూర్తి చేసి ప్రారంభించాలని ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టుల పూర్తికి రూ.1,078 కోట్లు ఖర్చు చేస్తే పూర్తి చేయొచ్చని భావించింది. అయితే సాంకేతిక, వాతావరణ అంశాల వల్ల ప్రాజెక్టులు పూర్తికాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మార్చి ఆఖరుకు పూర్తి కావాల్సిన ప్రాజెక్టుల పనుల పూర్తి సెప్టెంబరుకు వాయిదా పడ్డాయి. నెల్లూరు సంగం బ్యారేజీ, అవుకు టన్నెల్, వెలిగొండ టన్నెల్?2 హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు వెలిగొండ మొదటి టన్నెల్ నుంచి నీరు ఇవ్వడం వంటి లక్ష్యాలు విధించుకున్నారు. దీంతో పాటు వంశధార-నాగావళి అనుసంధానం, వంశధార రెండో భాగం రెండో దశ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటిదాకా రాష్ట్రంలో చేపట్టిన 54 ప్రాజెక్టుల పూర్తికి రూ.24,092 కోట్లు కావాలని జలవనరుల శాఖ కిందటి ఏడాది లెక్కలు తేల్చింది. కొత్త ప్రభుత్వ హయాంలో వీటి ప్రాధాన్యాలు తేల్చి ఆ ప్రకారం 2024కు ఏ ప్రాజెక్టులు ఎలా పూర్తి చేయాలో విభజించారు. ప్రాధాన్యాల వారీ మూడు విభాగాలు చేశారు. రూ.1,078 కోట్లు ఖర్చు చేస్తే పూర్తయ్యే ఆరు ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. మూడు విభాగాల్లోకి రాని మరో 12 ప్రాజెక్టుల్ని ఇతర కేటగిరీల్లో చేర్చారు. వీటి పూర్తికి ఏడాదికి ఎన్ని నిధులు కావాలో పక్కా లెక్కలు వేశారు. వెలిగొండ మొదటి టన్నెల్ తవ్వకం పనులే పూర్తయ్యాయి. మిగిలిన పనుల పూర్తికి కొత్త గడువును నిర్ధేశించుకోవాల్సి వచ్చింది. అవుకు టన్నెల్‌లో 180 మీటర్లకు పైగా ఫాల్టు జోన్ ఉంది. ఫాల్టు జోన్ లేని చోట కాంక్రీటు లైనింగు, టన్నెల్ తవ్వకం చేయాలి. అన్నీ కలిపి 16,310 క్యూబిక్ మీటర్ల మేర పని చేయాల్సి ఉండగా, 11 వేల క్యూబిక్ మీటర్లకు పైగా పెండింగులోనే ఉంది. సాంకేతిక అంశాలకు సంబంధించిన సమస్యలు ఎదురవుతున్న పరిస్థితి ఉంది. వెలిగొండ మొదటి టన్నెల్ నుంచి తాజా లక్ష్యం మేరకు 2021 సెప్టెంబరులో నీరు విడుదల చేయాలి. మొదటి టన్నెల్ తవ్వకం దాదాపు పూర్తయినా హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తికాలేదు. వేగం పుంజుకోవాల్సి ఉంది. హెడ్ రెగ్యులేటర్ పనులకు సంబంధించి ఆకృతులు ఖరారు కాలేదు. 9 హెక్టార్లకు పైగా అటవీ భూమి వినియోగానికి అనుమతులు రావాల్సి ఉంది. మొదటి టన్నెల్ దాదాపు పూర్తయినా రూ.140 కోట్ల విలువైన అనుబంధ పనులు ఫీడర్ కాలువ, తీగలేరు కాలువ, డిస్ట్రిబ్యూటరీల పనులు, టన్నెల్ లైనింగు పనులు పూర్తికాని పరిస్థితి. నెల్లూరు సంగం బ్యారేజీ పనులూ 84 శాతం వద్దే నిలిచిపోయాయి. సంగం బ్యారేజీని జులై 31 పూర్తి చేస్తామని తాజా గడువు పెట్టుకున్నారు. వంశధార-నాగావళి నదుల్ని అనుసంధానించే ప్రాజెక్టులో భాగంగా హిరమండలం జలాశయం నుంచి నారాయణపురం ఆనకట్టకు కాలువ తవ్వకం చేపట్టారు. 33 కిలోమీటర్ల కాలువలో 8.58 కిలోమీటర్ల తవ్వకం కాలేదు. కాలువపై 38 కట్టడాల నిర్మాణ పనులు నత్తనడకన నడుస్తున్న పరిస్థితి ఉంది. తోటపల్లి బ్యారేజీకి సంబంధించిన భూసేకరణ సమస్య తీరినా పనులు ఎప్పుడు పూర్తవుతాయో చెప్పలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం ప్రకటించిన ప్రాధాన్యతా ప్రాజెక్టుల పనులే నత్తనడకన నడుస్తుంటే మిగిలిన ప్రాజెక్టుల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది.

# 20 ఏళ్ల నుంచి గెలుపు కోసం నిరీక్షణ

నెల్లూరు, జూన్ 10, (న్యూస్ పల్స్)టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రాజకీయ జీవితం క్లోజ్ అయిపోయింది. ఆయన రాజకీయంగా అస్త్ర సన్యాసం చేయడమే మిగిలింది. ఇది నిజం.. తాజాగా జరిగిన తిరుపతి ఉప ఎన్నికల ఫలితాల్లో వైసీపీ అభ్యర్థి డాక్టర్ గురుమూర్తి ఏకంగా 2.71 లక్షల ఓట్ల భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించారు. ఈ ఉప ఎన్నిక బాధ్యత మొత్తం చంద్రబాబు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పైనే పెట్టారు. తిరుపతి పార్లమెంటు స్థానం చిత్తూరు, నెల్లూరు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది.. కనీసం సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నెల్లూరు జిల్లాలో ప్రభావం చూపలేదు సరికదా ? ఆయన సొంత నియోజకవర్గం అయిన సర్వేపల్లిలో ఎంత మాత్రం ప్రభావం చూపలేకపో యారు. ఈ సెగ్మెంట్ వరకు చూస్తే వైసీపీ అభ్యర్థి గురుమూర్తికి ఏకంగా 40 వేల ఓట్ల పై చిలుకు మెజార్టీ వచ్చింది.అప్పుడెప్పుడో 1999లో సర్వేపల్లిలో చివరిసారిగా గెలిచిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మళ్లీ గెలుపు అన్న మాటే మర్చిపోయారు. మధ్యలో కోవూరులో ఉప ఎన్నికతో కలుపుకుని సర్వేపల్లిలో మొత్తంగా నాలుగు సార్లు ఐదు సార్లు ఓడిపోయారు. ఇంత సీనియార్టీ ఉండి.. ఇన్ని సార్లు మంత్రిగా పనిచేసిన రాజకీయ నాయకుడు వరుసగా ఐదు సార్లు ఎన్నికల్లో ఓడిపోవడం అంటే దారుణ అవమానం అనే చెప్పాలి. 2014 ఎన్నికల్లోనూ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఓడినా తర్వాత రెండేళ్లకు చంద్రబాబు ఆయన సీనియార్టీని గౌరవించి ఎమ్మెల్సీని చేసి కేబినెట్లోకి తీసుకున్నారు. ఆ తర్వాత కూడా ఆయన జిల్లాలో గ్రూపు రాజకీయాలను ఎంకరేజ్ చేస్తూ కాలం గడిపారే తప్ప చివరకు సొంత నియోజకవర్గంలో కూడా పార్టీని బలోపేతం చేసుకోలేకపోయారు.గత సాధారణ ఎన్నికల్లో కాకాణి గోవర్ధన్ రెడ్డి చేతిలో వరుసగా రెండోసారి ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో 14 వేల ఓట్ల తేడాతో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఓడిపోతే.. ఈ ఉప ఎన్నికల్లో అదే సర్వేపల్లిలో వైసీపీకి ఏకంగా 40 వేల ఓట్ల భారీ మెజార్టీ వచ్చింది. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రభావం నియోజకవర్గంలో కాదు కదా.. కనీసం ఆయన సొంత మండలంలో కూడా లేదని స్పష్టంగా అర్థమవుతోంది. ఇన్నేళ్ల పాటు పదవులు.. సీనియార్టీ ఉండి కూడా రాజకీయంగా వీసమెత్తు ప్రభావం కూడా చూపలేకపోయారు.ఇంకా సోమిరెడ్డి పార్టీలో ఉండి పదవులు పట్టుకుని వేలాడినా ఉపయోగం ఉండదన్న చర్చల కూడా వస్తున్నాయి. పార్టీ అధికారంలో ఉన్నప్పుడే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీరుపై చాలా మంది పార్టీ నేతలు గరంగరంగా ఉన్నారు. ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న నేత కావడంతో పాటు చంద్రబాబు ఆయన మాటే వింటుండడంతో ఎవ్వరూ నోరు మెదపలేదు. ఇక గత ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడం ఒక మైనస్ అయితే.. జిల్లాలో పది సీట్లలోనూ చిత్తుగా ఓడిపోయింది. అప్పటి నుంచి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి టార్గెట్‌గా పలువురు పార్టీ నేతలు స్వరం పెంచుతూ వచ్చారు. ఇప్పుడు తిరుపతి ఉప ఎన్నికలకు ఆయనే బాధ్యుడుగా ఉన్నారు. ఇక్కడ పార్టీ ఘోరంగా ఓడిపోవడం ఒక మైనస్ అయితే.. ఆయన సొంత నియోజకవర్గంలో పార్టీ పరువు పూర్తిగా పోవడంతో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మరింత టార్గెట్ కానున్నారు. నైతికంగా ఈ ఓటమి కూడా కలుపుకుంటే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ఇది వరుసగా ఆరో ఓటమే అవుతుంది. మరి ఇంకా ఆయన పదవుల్లో ఉంటూ పార్టీకి భారంగా మారతారా ? లేదా వచ్చే ఎన్నికల నాటికి అయినా వారసుడికి పూర్తిగా పగ్గాలు ఇచ్చేసి రెస్ట్ తీసుకుంటారా ? అన్నది చూడాలి.

# 2024 లో మెగా బ్రదర్స్ ఎంట్రీ

విజయవాడ, జూన్ 10, (న్యూస్ పల్స్)కిరీటం ఎవరి నెత్తిన ఉంటే ఎవరైనా కింగే. ఆ కిరీటాన్ని తీసుకెళ్ళి మరొకరికి పెట్టి కింగ్ మేకర్ కావాలని ఎవరూ అనుకోరు. రాజకీయాల్లో అలా అనుకున్న వారు జీవితకాలంలో కింగ్ కాలేకపోయారు. ఇన్నేళ్లకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు ఆ సంగతి బాగా అర్థమైందిట. తాను కింగ్ తప్ప మరేమీ కోరుకోవడంలేదని పవన్ తన యాక్షన్ ద్వారా పక్కా క్లారిటీగా తెలియచేస్తున్నాడు. దానికి అవసరం అయ్యే పొత్తులకే ఆయన రెడీ అంటున్నారుట. బీజేపీతో పవన్ కి ఏ పేచీ పూచీ లేదు. ఎందుకంటే తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికలకు ముందు ఆ పార్టీ పవన్ కల్యాణ్ తమ సీఎం క్యాండిడేట్ అని గట్టిగానే చెప్పేసింది.ఇపుడు కాకపోయినా రేపటి రోజు అయినా పవన్ కళ్యాణ్ టీడీపీ వైపు వస్తారు అని చంద్రబాబే కాదు ఆయన అనుకూల మీడియా కూడా కడు నమ్మకంగా ఉన్నాయి. కానీ జరుగుతున్నది వేరు. పవన్ కళ్యాణ్ టీడీపీకి మళ్ళీ మద్దతు ఇచ్చే సీన్ లేదని అంటున్నారు. పైగా పొత్తుల పేరిట ఇప్పటికి అయిన అల్లరి చాలని కూడా భావిస్తున్నారుట. టీడీపీకి బీ టీమ్ అంటూ వైసీపీ చేసిన యాగీతో కూడా తమ పార్టీ బాగా నష్టపోయింది అని పవన్ కళ్యాణ్ తలపోస్తున్నారుట. అందువల్ల టీడీపీతో దోస్తీకి నై నై అనేస్తున్నారుట. ఏది ఏమైనా తనకు తానుగానే తేల్చుకోవాలన్నది పవన్ ఆలోచనగా ఉందని టాక్.బీజేపీతో పవన్ కల్యాణ్ పొత్తు కొనసాగుతుందిట. కానీ ఏపీ వరకూ పవనే కూటమికి పెద్దన్నగా ఉంటారుట. మెజారిటీ సీట్లు జనసేన పోటీ చేస్తే జూనియర్ పార్టనర్ గానే బీజేపీ ఉండబోతుందిట. అలా బలమైన జాతీయ పార్టీ బీజేపీ మద్దతు తీసుకుని 2024 ఎన్నికలకు పవన్ పోటీ పడబోతున్నారుట. తనకు బలమున్న ప్రాంతాలలో ఈసారి ఎక్కువ సీట్లు తెచ్చుకుంటే ముఖ్యమంత్రి సీటు ఎందుకు తన దగ్గరకు రాదు అన్నదే పవన్ కల్యాణ్ పంతమని చెబుతున్నారు. అంటే రేపటి రోజున ఏపీలో ట్రయాంగిల్ పోటీ జరిగితే బీజేపీ జనసేన కూటమికి మంచి అవకాశాలు ఉంటాయని కూడా అంచనా వేస్తున్నారుట. ఒకవేళ జగన్ సర్కార్ మీద వ్యతిరేకత ఉంటే దాన్ని టీడీపీకి కాకుండా తమ కూటమే సొంతం చేసుకోవాలంటే కచ్చితంగా విడిగా పోటీ చేయడమే మేలు అనుకుంటున్నారుట.టీడీపీ బీజేపీ కి స్నేహ హస్తం చాచినా కూడా బీజేపీ వెంటనే అలెర్ట్ అయి ఖండించేసింది. దీని వెనక పవన్ కళ్యాణ్ ఆలోచనలు ఉన్నాయని అంటున్నారు. చంద్రబాబు తెలివిగా మూడు పార్టీలూ ఒక్కటే అని జనాల్లో గందరగోళం క్రియేట్ చేయడం ద్వారా తమ అవకాశాలు తగ్గిస్తున్నాడు

అన్నదే పవన్ కళ్యాణ్ ఆలోచనట. అందుకే అర్జంటుగా బీజేపీ నుంచి ఈ కౌంటర్ వచ్చిందని అంటున్నారు. ఇక రేపటి రోజున మెజారిటీకి సరిపడా సీట్లు రాకున్నా కూడా గణనీయమైన సీట్లు తెచ్చుకుంటే ముఖ్యమంత్రి సీటుకే పోటీ పడేందుకు బేరమాడే శక్తి వస్తుందని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారుట. అంటే 2024లో విగరస్ గా కూటమి తరఫున ప్రచారం చేయడం ద్వారా త్రిశంకు సభను ఏరికోరి తీసుకురావాలి అన్నది పవన్ కళ్యాణ్ టార్గెట్ అంటున్నారు. ఎన్నికల తరువాత అవసరం అయితే టీడీపీ లాంటి వాటి సాయం తీసుకుని గద్దెనెక్కవచ్చు అన్నది కూడా వ్యూహంగా ఉందిట. మొత్తానికి పవన్ మాస్టర్ ప్లాన్ వెనక ఆయన అన్న చిరంజీవి కూడా ఉన్నారని చెబుతున్నారు. మొత్తానికి మెగా బ్రదర్స్ రాజకీయంతో ఏపీ రాజకీయాల్లో 2024 పెద్ద సంచలనమే నమోదు చేయనుంది అన్న మాట.

# శ్రీకాకుళంలో నినదించిన కార్మిక సంఘాలు



శ్రీకాకుళం,జూన్10: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనను ఎండగడుతూ దేశవ్యాప్త నిరసనోద్యమంలో భాగంగా గురువారం శ్రీకాకుళం 7రోడ్ జంక్షన్ లో సీఐటీయూ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు మెడలో వేసుకుని నిరసన చేపట్టారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు, రైతులకు, ప్రజలకు తీవ్రమైన నష్టం కలిగించే విధానాలని అమలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ రెండోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత పూర్తిగా కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వరంగాన్ని కారుచౌకగా అమ్మేస్తున్నారని మండిపడ్డారు. ఈ విధానాలను అన్ని వర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడానికి జూన్ 1నుండి 10వ తేదీ వరకు గ్రామాల్లో, పట్టణాల్లో, కార్మిక వాడల్లో, పని ప్రదేశాల్లో బిజెపి అనుసరిస్తున్న పచ్చి ప్రజావ్యతిరేక విధానాలులను విస్తృతంగా ప్రచారం చేయడం జరిగిందని అన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి యజమానులకు కట్టుబానిసలుగా కార్మికవర్గాన్ని మార్చాలని కార్మిక చట్టాలల్లో మార్పులు తీసుకొచ్చి పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్న

**కేంద్ర ప్రభుత్వ విధానాలను సమీక్షించాలి**

**కార్పోరేట్లకు కొమ్ము కాస్తోన్న బిజెపి**

పరిస్థితి ఉందని అన్నారు. దేశంలో ఎటువంటి కార్మిక చట్టాలు ఇకమీదట అమలు కాని పరిస్థితి ఏర్పడిందని, కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా అభద్రతాభావంతో ఈ పని చేయవలసిన పరిస్థితి తీసుకువచ్చారని విమర్శించారు. మరోపక్క రైతాంగానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 3నల్లచట్టాలను తీసుకు వచ్చి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ వ్యవసాయం గా మార్చేందుకు, రైతులు సాధించుకున్న చట్టాలను సైతం రద్దు చేసిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రైతాంగానికి కనీస మద్దతు ధర లేకుండా, మార్కెట్ యార్డులు లేకుండా, ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పించుకునేందుకు దుర్మార్గమైన చట్టాలను తీసుకువచ్చా యని, ఈ చట్టాలకు వ్యతిరేకంగా గత ఆరు మాసాలుగా రైతులు ఢిల్లీ కేంద్రంగా పోరాటం నిర్వహిస్తున్నా బిజెపి ప్రభుత్వం చల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను, నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయకుండా ఇష్టారాజ్యంగా మార్కెట్ శక్తులకు విడిచిపెట్టి ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నారని విమర్శించారు. కరోనా కష్టకాలంలో ప్రజలందరికీ ఉచిత వ్యాక్సిన్ అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని, వ్యాక్సిన్ అందక లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉందని అన్నారు. కరోనా కాలంలో వలసకార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు గురయితే కనీసం పట్టించుకోవడం లేదని, ప్రజలందరికీ కావలసిన మౌలిక వసతులు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని టీకాల ఉత్పత్తి పెంచి, అందరికీ టీకాలు కేంద్రమే ఉచితంగా వేయాలని, రాబోయే 3వ దశకు సరిపడా బెడ్లు, ఆక్సీజెన్, మందులు మరియు ఆరోగ్య మౌలిక సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు.

## ఆటో కార్మికుల కష్టాలు ఇంతింత కాదయా



ఒంగోలు, జూన్ 10, (న్యూస్ పల్స్)రోనా అన్ని రంగాలను కుదిపేస్తోంది. కూలీ దొరకుండా చేస్తోంది. కూడు లేకుండా చేస్తోంది. నిరుపేదల కుటుంబాల్లో మంచినీళ్లే పరామన్నాలయ్యాయి. పస్తులు, అవస్థలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇటు ఆటో కార్మికులు సైతం దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ఆటో తిరిగితేనే కడుపు నిండుతుంది. కానీ లాక్‌డౌన్ కారణంగా ఆటో చక్రాలు ఆగిపోయాయి. మినహాయింపు టైంలో అడ్డామీదకు వచ్చినా ఆటో ఎక్కేవారు లేరు. ఒకవేళ కిరాయి దొరికినా ఎక్కడ ఫైన్ పడుతుందో అని బిక్కుబిక్కుమంటున్నారు ఆటో డ్రైవర్లు తూర్పుగోదావరి జిల్లాలోని ఆటో డ్రైవర్ల దుస్థితిపై స్పెషల్ స్టోరీ. కరోనా కాలంలో ఆటో డ్రైవర్ల జీవితాలు ముందుకు సాగని చక్రలయ్యాయి. ఆటో తిరిగితే ఆ కుంటుంబం పట్టెడన్నం తింటుంది. కానీ లాక్‌డౌన్ కారణంగా ఆటోలు షెడ్డులకే పరిమితం అయ్యాయి. మినహాయింపు టైంలో అడ్డామీదకు వచ్చినా ప్రయోజనం శూన్యం. కిరాయిలు దొరకడం లేదు. కరోనా భయంతో ఒకరు, ఇద్దర్ని మాత్రమే ఎక్కించుకోవాల్సి వస్తుంది. దీంతో ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని తూర్పుగోదావరి జిల్లాలోని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. ఆటో తీసుకొని రోడ్డుమీదకు వస్తే వంద రూపాయలు సంపాదించడం గగనమైతోంది. నిత్యవసర సరుకులు, పెట్రోల్ ధరలేమో ఆకాశన్నంటుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్నాయి. మైలేజ్ రాక కిరాయిలు లేక ఆటో డ్రైవర్లు తీవ్ర అవస్థలుపడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 30 వేలకు పైగా మంది ఆటోకార్మికులు ఉన్నారు. కర్ఫ్యూ ఆంక్షాలు వీరి కడుపు మాడ్చేలా చేస్తున్నాయి. పూట గడవడమే కష్టమైపోతుంటే ఫైనాన్స్ వేధింపులు కూడా వెంటాడుతున్నాయి. ప్రతి నెలా ఫైనాన్స్ చెల్లించకపోతే వడ్డీలతోవాయిస్తున్నారని ఆటో డ్రైవర్లు అల్లాడిపోతున్నారు. ఇన్నేసి కష్టాలతో నెట్టుకస్తున్న ఆటోడ్రైవర్లను ట్రాఫిక్స్ నిబంధనలు నిండా ముంచుతున్నాయి. ఏ చిన్న రూల్ అతిక్రమించినా 5 వందల రూపాయాలకు పైగా పెనాల్టీ పడిపోతుంది. అసలే చాలి చాలని సంపాదన పిల్లలకు ఏం పెట్టాలి. మేము ఏం తినాలి.. ఫైన్‌లు ఎలా కట్టాలని వాపోతున్నారు ఆటో డ్రైవర్లు. గత ఏడాది చేసినా అప్పులే ఇంకా తీరలేదు. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి. ఏం చేయాలో తెలియక ఆటో డ్రైవర్లు మదన పడుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, చలానాల నుంచి విముక్తి కలిగించాలని కోరుకుంటున్నారు.

## జూన్ 12వ తేదీ నుండి భక్తులకు మరింత సులభంగా వసతి గదుల కేటాయింపు

తిరుమల జూన్ 10 భక్తుల సౌకర్యార్థం జూన్ 12వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి తిరుమలలోని ఆరు ప్రాంతాల్లో నూతనంగా టిటిడి ఏర్పాటు చేసిన కౌంటర్లలో వసతి గదుల కొరకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని టిటిడి కల్పిస్తోంది. ఇప్పటి వరకు తిరుమలలోని వసతి కొరకు సిఆర్‌వో వద్ద పేర్లు రిజిస్ట్రేషన్ మరియు గదులు కేటాయిస్తున్న విషయం విదితమే. శనివారం నుండి జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద ఉన్న లగేజి కౌంటర్ నందు రెండు కౌంటర్లు, బాలాజి మెయిన్ బస్టాండ్ వద్ద రెండు కౌంటర్లు, కౌస్తుభం అతిథి భవనం వద్ద ఉన్న కారు పార్కింగ్ ప్రాంతంలో రెండు కౌంటర్లు, రాంభగిచ బస్టాండ్ వద్ద రెండు కౌంటర్లు, ఎమ్‌బిసి ప్రాంతంలోని శ్రీవారి మెట్టు వద్ద రెండు కౌంటర్లు, సిఆర్‌వో వద్ద రెండు కౌంటర్లలో భక్తులు వసతి కోరకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న భక్తులకు ఎస్ ఎమ్ ఎస్ ద్వారా వారికి కేటాయించిన గదుల సమాచారం తెలియజేయబడుతుంది. అనంతరం వారికి గదులు కేటాయించిన ప్రాంతాల్లోని ఉప విచారణ కార్యాలయాల వద్ద రుసుం చెల్లించి గదులు పొందవచ్చు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది.

## 100 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ఎమ్మిగనూరు పట్టణంలోని షాలేం సపోజ్ సంఘము పాస్టర్ హెబ్నేజర్ మరియు రూతమ్మ గార్ల ఆధ్వర్యంలో, మల్లెల గ్రూప్స్ అధినేత డా. మల్లెలఆల్ఫ్రెడ్ రాజు గారి చేతుల మీదుగా 100 కుటుంబాలకు నెలకు సరిపోయే నిత్యావసర సరుకులను అందించటం జరిగింది.. ఈ సందర్భంగా డా. మల్లెలఆల్ఫ్రెడ్ రాజు గారు మాట్లాడుతూ దేవుని కృపను బట్టి, దేవుని ఆశీర్వాదముతో షాలేం సపోజ్ సంఘకాపరి ఈ లాంటి మంచి కార్యక్రమము చేయటం అభినందనీయం అని అలాగే భవిష్యత్తులో కూడా అనేక కార్యక్రమాలు ఈ సంఘకాపరి హెబ్నేజర్ గారి ఆధ్వర్యంలోజరగాలని ఆశిస్తున్నాను. అలానే ఈ కార్యక్రమం నా చేతుల మీదుగా జరిగించటం చాలా సంతోషంగా ఉంది అని చెప్పటం జరిగింది... ఈ కార్యక్రమంలో వసుంధర, లక్ష్మీ, రాజు ,సతీష్,మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు....

# సంవత్సరం పూర్తి చేసుకున్న సుందరకాండ పారాయణం

**విశ్వవ్యాప్తంగా భక్తుల నుండి విశేష స్పందన**

తిరుమల, జూన్ 10 విశ్వంలోని సకల జీవరాశులు ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై టిటిడి నిర్వహిస్తున్న సుందరకాండ పారాయణం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసింది. విశ్వవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల నుండి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ కెఎస్ఎస్ అవధాని మాట్లాడుతూ కోవిడ్ - 19 వ్యాధిని అరికట్టాలని, లోక కల్యాణార్థం టిటిడి నిర్వహిస్తున్న మహామంత్ర పారాయణ యజ్ఞంలో భాగంగా, సుదరకాండ పారాయణం ప్రారంభించి నేటికి సంవత్సరము పూర్తి కాగా, మంత్ర పారాయణం 427 రోజులు పూర్తి చేసుకుందన్నారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణంలోని సుందరకాండ పారాయణం వలన బుద్ధి, బలం, ధైర్యం కలిగి సకల జీవులు ఆయురారోగ్యాలతో ఉంటాయని తెలిపారు. ఒక గొప్ప ఉద్దేశ్యంతో చేపట్టిన మహామంత్ర పారాయణం వలన ఖచ్చితంగా మంచి ఫలితాలు ఇస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. ఇందులో భాగంగా గత ఏడాది మార్చి 16 నుండి 25వ తేదీ వరకు శ్రీనివాస వేదమంత్ర ఆరోగ్య జపయజ్ఞం, మార్చి 26 నుండి 28వ తేదీ వరకు శ్రీ శ్రీనివాస శాంత్యోత్సవ సహిత ధన్వంతరి మహాయాగం నిర్వహించిన విషయం తెలిసిందే. అనంతరం నాదనీరాజనం వేదికపై "యోగవాశిష్టం - శ్రీ ధన్వంతరి మహామంత్రం" పారాయణాన్ని గత ఏడాది ఏప్రిల్ 10 నుండి జూన్ 10వ తేదీ వరకు 62 రోజుల పాటు నిర్వహించారు. ఆ తరువాత జూన్ 11వ తేదీ ప్రారంభమైన సుందరకాండ పారాయణం జూన్ 10వ తేదీకి 365 రోజులు పూర్తయింది. ఇప్పటి వరకు టిటిడి 14వ విడతలుగా సుందరకాండ అఖండ పారాయణం, సెప్టెంబరు 29 నుండి అక్టోబరు 14వ తేదీ వరకు షోడశదిన సుందరకాండ దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించింది. జూలై 15న విరాటపర్వం - లోక కల్యాణ పారాయణం, సెప్టెంబరు 10వ తేదీ నుండి గీతా పారాయణం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఈ ఏడాది మే 3 నుండి 18వ తేదీ వరకు షోడశదిన సుందరకాండ దీక్ష, మే 9వ తేదీ నుండి నక్షత్రసత్ర మహాయాగం నిర్వహిస్తున్నది. అదేవిధంగా మే 31న 16 గంటల పాటు ఏక దిన అఖండ సుదరకాండ పారాయణం జరిగింది. జూన్ 11నుండి జూలై 30వ తేదీ వరకు యుద్ధకాండ పారాయణం నిర్వహించనున్నారు.తిరుమల ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ శ్రీ కుప్పా శివసుబ్రమణ్య అవధాని, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి శ్రీ విభీషణ శర్మ ఉదయం 7.00 నుండి 8.00 గంటల వరకు సుందరకాండను పారాయణం చేస్తున్నారు. ఈ పరాయణ కార్యక్రమంలో పండితులు శ్లోకాలను భక్తులతో పలికించి అర్థ తాత్పర్యాలతో పాటు ఆ శ్లోక ఉచ్చరణ వలన కలిగే ఫలితం, నేటి ఆధునిక సమాజంలోని మానవాళికి ఏవిధమైన సందేశం ఇస్తుందో వివరిస్తూ నిరంతరాయంగా పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఎస్వీబీసీలో ఈ పారాయణ కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ విదేశాల్లోని భక్తులు పెద్దసంఖ్యలో అనుసరించి తమ ఇళ్లలో పారాయణం చేస్తున్నారు.

## మోడీ మెడికల్ కిట్లు అందజేసిన బిజెపి కోఆర్డినేటర్ కరణం రెడ్డి నర్సింగ్ రావు

విశాఖపట్నం దేశ ప్రదాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు కరోన కష్టకాలంలో ముందుండి ప్రజల ప్రాణాలను కాపాడుతున్న డాక్టర్లు , నర్సులు,పోలీసులు,పారిశుద్ధ్య కార్మికులు, విలేకరులను గౌరవించుకోమని చెప్పారని అందులో బాగంగా మాజీ కేంద్ర మంత్రి వర్యులు మరియు బీజేపి జాతీయ ప్రదాన కార్యదర్శి శ్రీమతి దగ్గుబాటి.పురందేశ్వరి గారి పిలుపు మేరకు ప్రముఖ సంఘసేవకులు మరియు సింబయాషిస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఓ.నరేష్ గారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన సానిటైజర్ మాస్కులు గల మోదీ కిట్ ని జిల్లా అద్యక్షులు మేడపాటి రవీంద్ర గారి సూచనలమేరకు కరోన ఫ్రంట్ లైన్ వారియర్సలో ఒకరైన పోలీసులకు , గురువారం పెదగంట్యాడ న్యూపోర్టు సి ఐ రాము గారిని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి. నరసింగరావు 75వ వార్డు అధ్యక్షులు కే.ముసలయ్య గార్లు సాలువాతో సత్కరించి సానిటైజర్ మాస్కుల మోదీ కిట్ ని అందజేసి పార్టీ తరపున అభినందనలు తెలిపారు.

## వ్యాక్సినేషన్ సెంటర్లను తనిఖీ చేసిన మెడికల్ ఆఫీసర్

తుగ్గలి మండల కేంద్రమైన తుగ్గలిలోని వ్యాక్సినేషన్ సెంటర్లను తుగ్గలి ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు.గురువారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని గ్రామ సచివాలయంను,వ్యాక్సినేషన్ సెంటర్లను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలను తెలియజేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ 0-5 సంవత్సరాల లోపు పిల్లలకు పాలిచ్చే తల్లులు కూడా వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన తెలియజేశారు. ప్రభుత్వం అందించే వ్యాక్సిన్ పై ఎటువంటి అపోహలు నమ్మకుండా 45 సంవత్సరాలు పైబడిన ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యాక్సిన్ను స్వీకరించాలని ఆయన తెలియజేశారు.అదేవిధంగా వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి కూడా వివరించారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం 18 సంవత్సరాలు పైబడిన వారికి కూడా వ్యాక్సిన్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి విఆర్ఓ నాగేంద్ర,ఏఎన్ఎం దానమ్మ,అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు,ఆరోగ్య మిత్ర ఖాసీం మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ 79 వార్డులో హైపోక్లోరైట్ ద్రావణం పిచికారి

విశాఖపట్నం జీవీఎంసీ 79 వ వార్డ్ లో కోవిడ్ వ్యాప్తిని నిరోదించడం లో భాగంగా పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి ఆదేశాలు మేరకు గురువారం లంకలపాలెం జంక్షన్, గొల్లపేట, శ్రీ రంగానాయకలు కాలనీ మరిడిమాంబ కాలనీ, అప్పికొండ చేలు ,గెంజిపేట లలో 79 వ వార్డ్ వైస్సార్సీపీ ఇంచార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు తన సొంత నిధులతో సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు.ఈ కార్యక్రమంలో గోరుపుటి దేముడు, కర్రి నరసింగరావు, చెలపరెడ్డి రామారావు, కోటీని శ్రీనివాసరావు, కాశీ విశ్వనాథం, సురపునేని శ్రీనివాసరావు, గెంజి నాగేశ్వరరావు, అప్పికొండ చినరమణ, ఏలూరు రామారావు, చీర రమణ, బర్ల గంగరాజు, చీర దేముడు, బొట్ట అప్పలరాజు, యలమంచిలి గంగరాజు, దాకారపు హనుమంతు, బొక్కా మురళి,మాధవ్, నాని, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

# నందమూరి బాలకృష్ణ జన్మదిన సంబరాలు

## జిల్లా ఉపాధ్యక్షులు స్థానిక నివాసంలో బాలయ్య జన్మదిన వేడుకలు
## నటన లో వేరేవారు లేరు సాటి
## అబ్దుల్ రాహిమాన్

కౌతాళం ( విభారె) కౌతాళం మండలం లో యువరత్న నందమూరి బాలకృష్ణ గారి జన్మదిన సందర్భంగా ఎన్.బి.కె ఫ్యాన్స్ అధ్యక్షుడు రెహమాన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప స్థానిక నివాసం అభిమానులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బాలకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలుగుదేశం నాయకులు చెన్న బసప్ప, వెంకటపతి రాజు, కురువ సంఘము కార్యదర్శి విరేశ్ మాట్లాడుతూ ప్రతి సం బాలయ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాల ఆనందంగా ఉంది రాజకీయాల్లో హిందు పురం ఎమ్మెల్యే, నటనలో తనదైన ముద్ర వేసుకున్న నటుడు నందమూరి తారకరామారావు తర్వాత సినిమా కె వన్నె తెచ్చిన సినీ దిగ్గజుడు మన బాలయ్య అని అతను జన్మదిన వేడుకలు జరుపుకోవద్దని చెప్పిన అభిమానులు ముందు అది అసాధ్యమని తేల్చిచెప్పారు. ఇంతటి అభిమానులు మా తెలుగుదేశం లో ఉన్నందున మాకు గర్వంగా ఉందని తెలియజేశారు. అందరి బాలయ్య పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముస్లిం మైనారిటీ మండల కార్యదర్శి అబ్దుల్ రాహిమాన్ అద్వర్యం లో సాధువులకు,అనాథలకు దుప్పట్లు, మాస్క్ లు పంచి పెట్టారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పెంచిపెట్టారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపధ్యక్షుడు చన్న బసప్ప,టిడిపి రైతు కమిటీ జిల్లా ఉపాధ్యక్షడు వేంకటపతి రాజు,టిడిపి ముస్లిం మైనారిటీ మండల కార్యదర్శి బాలకృష్ణ అభిమానీ రెహమాన్, కాశీ విశ్వనాథ్,డా. రాజానంద్,మంజు, రాజబాబు,శివ, క్రిష్ణ కాంత్,పెద్ద ఈరప్పా,ముకన్న, బాలకృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం... సర్పంచ్ చౌడప్ప

తుగ్గలి పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం మరియు మంచి వాతావరణం గ్రామాలలో నెలకొంటుందని బొందిమడుగుల గ్రామ సర్పంచ్ ఎండా చౌడప్ప తెలియజేశారు. గురువారం రోజున తుగ్గలి మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు మరియు వార్డు సభ్యుల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ చౌడప్ప ప్రజలకు తడి మరి పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు.ఈ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మరియు అధికారులు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ తడి మరియు పొడి చెత్త బుట్టలను వినియోగించి వీధులను, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు తెలియజేశారు.మన రోజు దినచర్యలో భాగంగా మనం వాడి పడేసిన వ్యర్థాలను తడి మరియు పొడి చెత్తను చెత్త బుట్టల ద్వారా వేరుచేసి చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు ప్రజలకు తెలియజేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున, ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వారు తెలియజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే గ్రామాలు కూడా పరిశుభ్రంగా తయారయ్యి గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని వారు ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కౌలుట్లమ్మ,వార్డ్ సభ్యులు వీరేంద్ర,రంగ స్వామి, రహిమాన్, రంగనాథ్,మాబు,సంజీవ రాయుడు, ప్రతాప్ యాదవ్,వాలంటీర్లు సురేష్,రంగ స్వామి,బ్రహ్మయ్య,వీరాంజీ,లోకేశ్వరి మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలకు చేరుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

తిరుమల జూన్ 10 కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వెంకటేశ్వరుడిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దర్శించుకోకున్నారు. ఇవాళ తిరుమలకు చేరుకోనున్న సీజేఐ.. రాత్రి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్రీవారి దర్శనం చేసుకోవడం ఇదే మొదటిసారి.కాగా, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 24 నుంచి 42కు పెంచుతూ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సంబంధిత ఫైలుపై ఆయన బుధవారం సంతకం చేశారు. జడ్జీల సంఖ్యను ఏకంగా 75 శాతం పెంపుదల చేశారు. వీరిలో 32 మంది శాశ్వత న్యాయమూర్తులు, మిగిలిన పది మంది అదనపు న్యాయమూర్తులుగా విధులు నిర్వర్తిస్తారు. 42 మందిలో 28 మంది బార్ అసోసియేషన్ నుంచి న్యాయవాదులను ఎలివేషన్ చేస్తారు. మిగిలిన 14 మందిని జ్యుడిషియల్ సర్వీసెస్ నుంచి ఎంపిక చేస్తారు. ఈ నిర్ణయం ఈ నెల 8 నుంచే అమల్లోకి వస్తుందని సుప్రీంకోర్టు పేర్కొన్నది.2019 ఫిబ్రవరి 13న హైకోర్టు ప్రధాన నాయమూర్తి, తర్వాత గవర్నర్, సీఎం కేసీఆర్.. న్యాయమూర్తుల సంఖ్య పెంచాలని కేంద్రప్రభుత్వానికి, సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధాని, కేంద్ర న్యాయశాఖ మంత్రులు కూడా సమ్మతి తెలిపారు. జస్టిస్ ఎన్వీ రమణ సీజేఐగా బాధ్యతలు చేపట్టగానే దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించారు.తెలంగాణ హైకోర్టు ప్రతిపాదనకు కేంద్రన్యాయశాఖ ఈ ఏడాది మే 27న ఆమోదం తెలిపి, ఈ నెల 7న సీజేఐకి ఫైలు పంపింది. ఫైలు అందిన వెంటనే జడ్జిలను నియమిస్తూ సీజేఐ నిర్ణయం తీసుకున్నారు.

# మీరు టీ తాగేటప్పుడు లేదా టీ జతగా వీటిని తినకండి... లేకపోతే అది పెద్ద ప్రమాదంగా మారుతుంది ...!




చాలా మందికి టీ, కాఫీలంటే పిచ్చి. రోజులో నిద్రలేచిన వెంటనే వీటిలో ఏదో ఒకటి కడుపులో పడకపోతే..ఇక ఆ రోజు సవ్యంగా గడవదు. అలాగే రోజంతా చాలా అలసిపోయినప్పుడు వెంటనే టీ తాగాల్సిందే. అప్పుడుకానీ రిఫ్రెషింగ్ గా అనిపించదు. అందుకే టీని ఇష్టపడే మిలియన్ల మంది ఉన్నారు. ఎప్పుడైనా టీ తాగడం వల్ల అది అందించే తాజాదనాన్ని భర్తీ చేయదు. టీ భారతదేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన పానీయం మరియు ఇది మన దేశం యొక్క జాతీయ పానీయం అని సులభంగా చెప్పవచ్చు.మిల్క్ టీతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తాగే అనేక రకాల టీలు ఉన్నాయి. గ్రీన్ టీ మరియు బ్లాక్ టీ నుండి చమోమిలే మరియు హెర్బల్ టీల వరకు, లెక్కలేనన్ని రకాల టీలు ఉన్నాయి, ప్రతి దాని స్వంత ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయి. మీరు టీ ప్రేమికులైతే, టీ తాగేటప్పుడు తినదగని పదార్థాలు ఉన్నాయి. అవి ఏమిటో తెలుసుకోవడం చాలా అవసరం.ఐరన్ అధికంగా ఉండే ఆహారాలు టీతో సరిపడవు. టీలో టానిన్లు మరియు ఆక్సలేట్లు ఉన్నందున, ఇది ఆహారాల నుండి ఇనుము శోషణను నిరోధిస్తుంది. ఈ సమ్మేళనాలు వాటికి ఇనుమును బంధిస్తాయి, ఇవి రక్తంలో కలిసిపోకుండా నిరోధిస్తాయి. మీరు ఇనుము అధికంగా ఉండే గింజలు, పచ్చి ఆకు కూరలు, తృణధాన్యాలు, చిక్కుళ్ళు మరియు తృణధాన్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలి.గర్భిణీ మరియు పాలిచ్చే మహిళలకు పసుపు మంచిదా? అధ్యయనం ఏమి చెబుతుందో మీకు తెలుసా?గర్భిణీ మరియు పాలిచ్చే మహిళలకు పసుపు మంచిదా? అధ్యయనం ఏమి చెబుతుందో మీకు తెలుసా?నిమ్మకాయ టీని ప్రముఖ బరువు తగ్గించే పానీయంగా ఉపయోగిస్తారు మరియు దీనిని ఉదయం ప్రజలు ఎక్కువగా వినియోగిస్తారు. టీ ఆకులు నిమ్మరసంతో కలిపి టీని ఆమ్లీకరిస్తాయి మరియు మంటను కలిగిస్తాయి. ఖాళీ కడుపుతో ఉదయం నిమ్మకాయ టీ తాగడం వల్ల యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట వంటి సమస్యలు వస్తాయి. మీరు ఇప్పటికే ఆమ్లత్వంతో బాధపడుతుంటే, ఈ టీని పూర్తిగా నివారించడం మంచిది.మన పూర్వీకులు లైంగిక కోరికలు మరియు లైంగిక శక్తిని పెంచడానికి ఈ విత్తనాన్ని ఉపయోగించారు ...!మన పూర్వీకులు లైంగిక కోరికలు మరియు లైంగిక శక్తిని పెంచడానికి ఈ విత్తనాన్ని ఉపయోగించారు ...!పాలు మరియు పెరుగు రెండూ ఒకే పదార్థం నుండి ఉద్భవించినప్పటికీ, పాలు మరియు పెరుగు కలపడం వల్ల కొంతమందిలో గ్యాస్ట్రిక్ చికాకు లేదా అజీర్ణం వస్తుంది. పెరుగు తినేటప్పుడు పాలు తాగడం దీనికి కారణం. ఇది ఖచ్చితంగా నివారించవలసిన సమ్మేళనం.రంగు మీ సమస్య కాకపోతే చర్మంలో మిగిలిన సమస్యలకు పెరుగు పరిష్కారంరంగు మీ సమస్య కాకపోతే చర్మంలో మిగిలిన సమస్యలకు పెరుగు పరిష్కారంచాలా మంది టీ తాగేటప్పుడు కొన్ని స్నాక్స్ తీసుకోవడం సాధారణ విషయం. టీ టైమ్ స్నాక్స్ తరచుగా శెనగ పిండి లేదా మరికొన్ని పిండితో తయారు చేస్తారు, అది కొంతమందికి దుష్ప్రభావాలను కలిగిస్తుంది. టీ తాగేటప్పుడు శెనగ పిండితో తయారైన ఉత్పత్తులను తినడం వల్ల కొన్ని జీర్ణ సమస్యలకు దారితీస్తుంది మరియు ఈ కలయిక వల్ల వాటి నుండి తీసుకోబడిన పోషకాల సంఖ్యను గ్రహించే శరీర సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తుంది. కాబట్టి వాటిని అప్పుడప్పుడు తినడం మంచిది.టీ తాగేటప్పుడు పసుపు కలిగిన ఆహారాలు మానుకోవాలి ఎందుకంటే ఇది అపానవాయువు, ఆమ్లత్వం లేదా మలబద్ధకం వంటి కడుపు సమస్యలను కలిగిస్తుంది. పసుపు మరియు టీ ఆకులు పూర్తిగా విరుద్ధంగా ఉంటాయి మరియు సంఘర్షణకు కారణమవుతాయి, అంతరాయం కలిగిస్తాయి.

# దీపక్ చాహర్ న్యూలుక్‌పై సురేశ్ రైనా ఫన్నీ కామెంట్స్

న్యూఢిల్లీ: టీమిండియా డాషింగ్ బ్యాట్స్‌మెన్, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఆటగాడు సురేశ్ రైనా.. తన ఐపీఎల్ సహచరుడు, సీఎస్‌కే బౌలర్ దీపక్ చాహర్‌పై ఫన్నీ కామెంట్స్ చేశాడు. చాహర్.. తాజాగా తన న్యూలుక్‌కి సంబంధించిన ఫోటోను ట్విటర్‌లో పోస్ట్ చేయగా, రైనా స్పందించాడు. ఈ ఫోటోలో చాహర్.. ప్రముఖ వెబ్ సిరీస్ ఫ్యామిలీ మ్యాన్-2లో టెర్రరిస్ట్ క్యారెక్టర్‌ను పోలి ఉన్నాడని, ఫ్యామిలీ మ్యాన్ పార్ట్ 3 ఆన్ ద వే అంటూ కామెంట్ చేశాడు. ప్రస్తుతం రైనా చేసిన ఈ కామెంట్ నెట్టింట హల్‌చల్ చేస్తోంది. మరోవైపు చాహర్ అభిమానులు కూడా తమదైన శైలిలో స్పందించారు.ఫ్యామిలీ మ్యాన్-2లో లీడ్ రోల్ శ్రీకాంత్.. ఫ్యామిలీ అడ్వైజర్‌ను కలిసే సీన్ చాహర్‌కు సరిపోతుందంటూ కామెంట్ చేస్తున్నారు. మరికొందరైతే చాహర్.. గజినీలో ఆమీర్ ఖాన్‌ను పోలి ఉన్నాడంటున్నారు. ఇదిలా ఉంటే, దేశంలో ప్రస్తుతం 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్ మేనియా నడుస్తోంది. ఇటీవలే అమెజాన్ ప్రైమ్ ఓటీటీ ద్వారా విడుదలైన ఈ వెబ్ సిరీస్.. విమర్శకుల ప్రశంసల్ని సైతం అందుకుంటుంది. ఫ్యామిలీ మ్యాన్-2లో టాలీవుడ్ హీరోయిన్ సమంతా కీలక పాత్ర పోషించింది. నెగటివ్ రోల్ అయినప్పటికీ.. రాజీ పాత్రలో ఆమె ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సెకండ్ సీజన్‌ను తమిళులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

# బాలీవుడ్ పై పుష్ప టీమ్ స్పెషల్ ఫోకస్..!



ప్రస్తుతం కరోనా కారణంగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సినిమాలన్ని వాయిదా పడ్డాయి. అలాగే రిలీజ్ విషయాలు కూడా పక్కన పెట్టేసారు. కానీ బాగా ఆలస్యం అవుతుందని భావించిన సినిమాలు ఓటిటి వేదికగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. ఎందుకంటే షూటింగ్స్ అనుకున్న షెడ్యూల్లో జరిగితే ఇదివరకు ప్రకటించిన తేదీలలో సినిమాలు రిలీజ్ అయ్యేవి. కానీ ఓవైపు కరోనా విలయతాండవం చేస్తుండటంతో జనాలంతా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బ్రతుకుతున్నారు. అలాగే మేకర్స్ కూడా అన్ని సర్దేసి ఎవరిళ్లకు వారు చేరుకున్నారు. ఇలాంటి తరుణంలో సినిమా రిలీజ్ గురించి మాట్లాడుకోవడం కరెక్ట్ కాదని అందరూ సైలెంట్ అయిపోయారు.కానీ సినిమాలకు సంబంధించిన రూమర్స్ మాత్రం మేకర్స్ చెప్పకపోయినా వైరల్ అవుతూనే ఉంటాయి. ప్రస్తుతం స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ - సుకుమార్ కాంబినేషన్ లో పుష్ప సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న పుష్ప సినిమాను ఈ ఏడాది ఆగష్టు 13న రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా లేవు కాబట్టి సినిమాను వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు టాక్ నడుస్తుంది. అదికూడా పుష్ప సినిమాను మేకర్స్ దసరా ఫెస్టివల్ కు షిఫ్ట్ చేస్తున్నారని టాక్. ఒకవేళ ఇప్పుడు రిలీజ్ కు సిద్ధంగా ఉన్నటువంటి సినిమా కరెక్ట్ టైంకు రిలీజ్ అయితే మాత్రం పుష్ప.. దసరాకు వచ్చే అవకాశం ఉందని పుకార్లు వైరల్ అవుతున్నాయి.ఇదిలా ఉండగా.. సుకుమార్ దర్శకత్వంలో బన్నీ - దేవిశ్రీప్రసాద్ మూడో కాంబినేషన్ ఇది. ఈసారి పాన్ ఇండియా మూవీ అనేసరికి ఫ్యాన్స్ అంచనాలు ఓ రేంజిలో నెలకొన్నాయి. అయితే ఇప్పటివరకు వీరి కాంబినేషన్ లో వచ్చిన ఆర్యా - ఆర్య-2 సినిమాలు ఆడియో పరంగా ఏ రెంజీలో హిట్ అయ్యాయో తెలిసిందే. అయితే ఈసారి కూడా పుష్ప ఆడియో పై స్పెషల్ కేర్ తీసుకుంటున్నారట. అందుకే ఇప్పుడు సౌత్ లో ఎలాగో దేవిశ్రీ ఆడియో గురించి తెలుసు కాబట్టి.. ప్రస్తుతం నార్త్ లో కూడా అంటే పుష్ప హిందీ ఆల్బమ్ పై కూడా బాగా కసరత్తు చేస్తున్నారట. హిందీలో ఆల్రెడీ దేవికి మంచి నేమ్ ఉంది. ఈసారి హిందీలో దేవికి బన్నీకి బాలీవుడ్ లో ఫేమ్ కోసం సాలిడ్ హిట్ ట్రాక్స్ రెడీ చేస్తున్నారట. చూడాలి మరి ఆల్రెడీ ఓ బాలీవుడ్ యాక్ట్రెస్ పుష్ప ఐటమ్ సాంగ్ లో ఆడిపాడనుందని తెలిసిందే. ఇక ఈ సినిమాలో రష్మిక మందన హీరోయిన్ కాగా మైత్రి మూవీ మేకర్స్ సినిమాను నిర్మిస్తున్నారు.

# 'డియర్ మేఘ' నుంచి మరో బ్యూటిఫుల్ పోస్టర్..!

మేఘా ఆకాష్ - అరుణ్ అదిత్ - అర్జున్ సోమయాజుల ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న సినిమా "డియర్ మేఘ". వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ మరియు సోరింగ్ ఎలిఫెంట్ ఫిలిమ్స్ బ్యానర్స్ పై అర్జున్ దాస్యన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యంగ్ ఫిల్మ్ మేకర్ ఎ.సుశాంత్ రెడ్డి ఈ చిత్రాన్ని ఓ అందమైన




ఆసక్తికరమైన ప్రేమకథగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ సినిమాపై ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది. ఈ క్రమంలో నేడు హీరో అరుణ్ ఆదిత్ పుట్టినరోజు సందర్భంగా 'డియర్ మేఘ' నుంచి మరో న్యూ పోస్టర్ ను చిత్ర బృందం రిలీజ్ చేశారు. అరుణ్ అదిత్ భుజంపై మేఘా ఆకాష్ తలవాల్చి ఉన్న బ్యూటిఫుల్ 'డియర్ మేఘ' సెకండ్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా హీరో అరుణ్ ఆదిత్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మేకర్స్.. అరుణ్ పాత్ర సూపర్బ్ గా ఉంటుందని.. అతని నటన ఆడియెన్స్ ను మెస్మరైజ్ చేస్తుందని అన్నారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని ఫస్ట్ కాపీ రెడీ అవుతున్న ఈ చిత్రాన్ని ఓటీటీ రిలీజ్ చేయనున్నారు."డియర్ మేఘ" చిత్రాన్ని త్వరలోనే ఓ బిగ్ ఓటీటీ ప్లాట్ ఫామ్ మీద విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని.. ఈ సినిమాని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారని నమ్మకంతో ఉన్నామని నిర్మాత అర్జున్ దాస్యన్ తెలిపారు. ఈ చిత్రానికి హరి గౌర సంగీతం సమకూరుస్తున్నారు. ఐ ఆండ్రూ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. పీఎస్ వర్మ ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేస్తుండగా.. ప్రవీణ్ పూడి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ఎన్టీఆర్ మాట సాయంతో 3 భాగాలుగా 'బింబిసార'..?


నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తూ.. స్వీయ నిర్మాణంలో రూపొందుతున్న సినిమా "బింబిసార". చారిత్రక నేపథ్యమున్న సోషియో ఫాంటసీ కథాంశంతో కొత్త దర్శకుడు వశిష్ఠ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇటీవల విడుదలైన టైటిల్ లుక్ - మోషన్ పోస్టర్ విశేష స్పందన తెచ్చుకున్నాయి. చెడు నుంచి మంచి వైపు సాగిన టైం ట్రావెల్ మూవీ అని చెప్పి మేకర్స్ సినిమాపై అంచనాలు పెంచేశారు. ఇందులో బార్బేరియన్ కింగ్ బింబిసార గా కళ్యాణ్ రామ్ పవర్ ఫుల్ రోల్ లో కనిపించనున్నాడు. అయితే తాజాగా ఫిలిం సర్కిల్స్ లో వినిపిస్తున్న వార్తలు ఈ సినిమాపై మరింత హైప్ ను తీసుకొస్తున్నాయి.అదేంటంటే.. 'బింబిసార' చిత్రాన్ని మూడు భాగాలుగా విడుదల చేయనున్నారట. ముందుగా సింగిల్ మూవీగా చేయాలని స్టార్ట్ చేసినప్పటికీ.. ఇప్పుడు మగధ రాజ్యాన్ని పాలించిన రాజుల చరిత్రను 3 భాగాలుగా చెప్పాలని నిర్ణయించుకున్నారట. అయితే ప్రతి భాగానికి కొంత గ్యాప్ ఉంటుందని అంటున్నారు. ఇప్పటికే ఫస్ట్ పార్ట్ కు సంబంధించిన షూటింగ్ 80 శాతం షూటింగ్ కూడా కంప్లీట్ అవ్వగా.. దీనికి దాదాపు 40 కోట్ల వరకు బడ్జెట్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. కరోనా పరిస్థితులు కుదట పడగానే చిత్రీకరణ తిరిగి ప్రారంభించి.. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఫస్ట్ పార్ట్ ని విడుదల చేయాలని చూస్తున్నారని సమాచారం. ఇదే కనుక నిజమైతే టాలీవుడ్ లో 3 పార్ట్స్ గా వచ్చే ఫస్ట్ సినిమా ఇదే అవుతుంది.ఇకపోతే 'బింబిసార' చిత్రానికి యంగ్ టైగర్ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇవ్వనున్నారని వార్తలు వస్తున్నాయి. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకి తారక్ గొంతు తోడైతే మరో లెవల్ కి వెళ్తుందని మేకర్స్ భావిస్తున్నారట. ఎన్టీఆర్




స్వరం ఈ చిత్రానికి ప్లస్ పాయింట్ అవుతుందని నందమూరి అభిమానులు భావిస్తున్నారు. 'బింబిసార' కల్యాణ్ రామ్ కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో రూపొందుతోన్న సినిమా. భారీ సెట్స్ - గ్రాఫిక్స్ హంగులు దీనికి కీలకం కానున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటుగా పలు భారతీయ భాషల్లో విడుదల చేయనున్నారు. ఇందులో కేథరీన్ ట్రెసా - సంయుక్తా మేనన్ కథానాయికలుగా నటిస్తున్నారు. నందమూరి తారకరామారావు ఆర్ట్స్ బ్యానర్ పై కె.హరికృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# అఖిల్ 'ఏజెంట్' కోసం మరో స్టార్

అక్కినేని అఖిల్ హీరోగా రూపొందుతున్న మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ విడుదలకు సిద్ధం అయ్యింది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఆ సినిమా విడుదలకు సిద్ధం అయినా కరోనా వల్ల వాయిదా పడింది. మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ తర్వాత సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అఖిల్ మూవీ పట్టాలెక్కబోతుంది. ఇప్పటికే ఈ సినిమా అధికారిక ప్రకటన వచ్చింది. కరోనా వల్ల కాస్త ఆలస్యం అవుతుంది కాని అతి త్వరలోనే పూర్తి స్థాయిలో పట్టాలెక్కబోతుంది. ఈ సినిమాలో అఖిల్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందనే టాక్ వినిపిస్తుంది. ఇక ఈ సినిమాలో విలన్ పాత్రకు గాను స్టార్ నటుడిని ఎంపిక చేశారట.ఇటీవల కాలంలో కన్నడ స్టార్ ఉపేంద్ర వరుసగా తెలుగు సినిమాల్లో నటిస్తున్నాడు. ఒక వైపు కన్నడంలో హీరోగా నటిస్తూనే మరో వైపు ఇతర భాషల్లో విలన్ పాత్రల్లో నటిస్తున్నాడు. తెలుగు లో ఈయన ఏజెంట్ లో విలన్ గా నటించేందుకు ఓకే చెప్పాడని తెలుస్తోంది. సురేందర్ రెడ్డి స్టైలిష్ మేకింగ్ తో ఏజెంట్ ను స్టైలిష్ మూవీగా రూపొందించబోతున్నట్లుగా తెలుస్తోంది. అఖిల్ కమర్షియల్ సక్సెస్ కోసం చాలా కాలంగా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. కాని ఆయనకు ఆశించిన సక్సెస్ మాత్రం దక్కడం లేదు.మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ తర్వాత ఏజెంట్ సినిమా తో ఖచ్చితంగా అఖిల్ సక్సెస్ ను దక్కించుకోవడం ఖాయం అంటున్నారు. ఈ సినిమా పై నాగార్జున చాలా నమ్మకంగా ఉన్నాడట. ఈ సినిమాను వచ్చే ఏడాది ఆరంభంకు ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ఏజెంట్ కు ఉపేంద్ర జత అవ్వడం ఖచ్చితంగా అదనపు ఆకర్షణ అంటున్నారు. రా ఏజెంట్ పాత్రలో అఖిల్ కనిపించనుండగా ఉపేంద్రను సురేందర్ రెడ్డి ఎలా చూపించబోతున్నాడు అనేది చూడాలి.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190